RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 318 శుక్రవారం 12 డిసెంబర్ 2025 పేజీలు : 4 వెల : రూ. 2.00

### భారత్ సహా 13 దేశాల వీసాలు తాత్కాలికంగా నిషేధం..

సౌదీ అరేబియా హజ్ యాత్రకు వెళ్లే హజ్ యాత్రికులు, ఉమ్రా సందర్శకులకు 2025 సీజన్‌లో కీలకమైన మార్పులు ప్రకటించారు. ఈ ఏడాది హజ్ యాత్ర దగ్గరపడుతుండటంతో సౌదీ అరేబియా.. భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్ సహా ఇతర 11 దేశాల పౌరులపై వీసా నిషేధం విధించింది. ఈ నిర్ణయం 2025 జూన్ నెల మధ్య వరకు అమల్లో ఉంటుంది.
**ప్రభావిత దేశాలు :** హజ్ 2025 సీజన్ సందర్భంగా భారతదేశం, పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఈజిప్ట్, ఇండోనేషియా, ఇరాక్, నైజీరియా, జోర్డాన్, అల్జీరియా, సూడాన్, ఇథియోపియా, ట్యునీషియా, యెమెన్, మొరాకో వంటి 14 దేశాలకు చెందిన పౌరులపై వీసా నిషేధం అమలులోకి వచ్చింది. దీంతో, ఈ దేశాలకు చెందిన వ్యక్తులు ఉమ్రా, వ్యాపార లేదా కుటుంబ సందర్శన వీసాలు పొందడానికి ఇప్పుడు తాత్కాలికంగా అవకాశం లేదు.



# గెలిచినోడే మనోడు!

## పంచాయతీ పోరులో 'కొత్త ఫార్ములా'

హైదరాబాద్ : తెలంగాణ పంచాయతీ పోరులో మొదటి విడత ముగిసింది. రెండు, మూడు విడతలకు ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. పంచాయతీ ఎన్నికల్లో ఒకే పార్టీ నుంచి ఇద్దరు.. ముగ్గురు పోటీ పడుతున్నారు. వారి కి ఆ పార్టీ నేతలు సర్ది చెప్పలేక గెలిచినోడే మనోడు అనే పరిస్థితికి వచ్చేశారు. ప్రధానంగా అధికార పార్టీకి రెబల్స్ బెడద ఎక్కువగా ఉంది.

సర్ది చెప్పినా వినకపోవడంతో పోటీ అనివార్యమైంది. గెలిచి రండంటూ ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ప్రధానంగా అధికార పార్టీ మద్దతుతో పోటీ చేస్తున్న అభ్యర్థులకు, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వలసొచ్చి ఎన్నికల్లో నిలబడిన అభ్యర్థులకు మధ్య లోకల్ వార్ నడుస్తోంది. నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం ముగియడంతో ప్రచారం ఊపందుకుంది.

**లోకల్ వార్..** మొదటి, రెండో, మూడో విడత పంచాయతీ ఎన్నికల ప్రచార సరళిని పరిశీలిస్తే.. ఓటర్లు ఎవరికి మద్దతిస్తున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. మెజార్టీ గ్రామాల్లో కాంగ్రెస్ రెండు వర్గాలు పోటీ చేస్తున్నాయి. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరి పోటీ చేస్తున్న అభ్యర్థులు సైతం దీటుగానే తలపడుతున్నారు. ఇరువర్గాలు బలంగా ఉన్న గ్రామాల వైపు పార్టీ కీలక నేతలు చూసీచూడనట్టుగానే వదిలేశారు. ఎన్నికల ఫలితాలు వచ్చాక చూద్దాంలే అన్నట్టుగా డబుల్ గేమ్ ఆడుతున్నారని తెలుస్తోంది. అయితే పలువురు అభ్యర్థులు పార్టీ మద్దతు మాకంటే మాకే ఉందని ప్రచారం చేయడమే గాక.. ప్రచారం వీడియోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు.

**పార్టీ జెండాలతోనే ప్రచారం...** పార్టీల రహితంగా జరిగే ఎన్నికలే అయినా.. అభ్యర్థులు మాత్రం పార్టీల జెండాలతోనే వాడవాడలా ప్రచారం చేస్తున్నారు. పంచాయతీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలు ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నాయి. ప్రధాన పార్టీలన్నీ స్థానికంగా అవగాహనతోనే పోటీ చేస్తున్నాయి.

**మద్యం, డబ్బు పంపిణీ...** ఎన్నికల ప్రచార పర్వంలో భాగంగా మద్యం, డబ్బు ఏరులై పారుతున్నాయి. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే మద్యం పంపిణీ జోరుగా సాగుతుండగా.. ఓటర్లకు పెద్ద గ్రామ పంచాయతీల్లో రూ.వెయ్యి నుంచి రూ. 2వేలతోపాటు క్వార్టర్, ఓ మోస్తరు పంచాయతీల్లో మందుతోపాటు రూ. 500, చిన్న గ్రామాల్లో మందు మాత్రమే పంపిణీ చేస్తున్నట్లు తెలుస్తోంది.



## సర్పంచ్ ఎన్నికలలో...

# కాంగ్రెస్ విజయ దుందుభి

హైదరాబాద్: తెలంగాణలో తొలి విడత పంచాయతీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగింది. కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుపొంది తొలి స్థానంలో ఉంది.

కాంగ్రెస్ ఇప్పటి వరకు 990 స్థానాలలో గెలుపొందగా.. బిఆర్ఎస్ 445, బిజెపి 83, ఇతరులు 210 స్థానాలలో విజయం సాధించారు. వార్డు మెంబర్లలో కాంగ్రెస్ 11230 స్థానాలలో గెలుపొందగా బిఆర్ఎస్ 5000, బిజెపి 2000, ఇతరలు 7500 స్థానాలలో విజయ దుందుభి మోగించారు.

కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి. ఇతరుల స్థానాలలో గెలిచిన వారు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు.




న్యూఢిల్లీ, డిసెంబర్ 11: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ బయలుదేరారు. హైదరాబాద్ బయలుదేరే ముందు పార్లమెంటులో సీఎం మీడియాతో ముచ్చటించారు. ఈనెల 13న ప్రముఖ ఫుట్‌బాల్ క్రీడాకారుడు మెస్సీ హైదరాబాద్ వస్తున్నారని తెలిపారు. ఒక ప్రముఖ సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మెస్సీ హాజరవుతున్నారని.. ముఖ్యమంత్రిగా ఉన్నాను కాబట్టి తనను కూడా ఒక అతిథిగా పిలిచినట్లు చెప్పారు. తాను కూడా ఒక అతిథిగానే ఆ కార్యక్రమానికి హాజరవనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఈ కార్యక్రమానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఒక ప్రముఖ క్రీడాకారుడు హైదరాబాద్‌కు వస్తున్నారు కాబట్టి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఇస్తున్నామని తెలిపారు. మెస్సీ కార్యక్రమానికి రావాలని కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్, ప్రియాంక గాంధీలను కోరానని.. అలాగే ఢిల్లీలో కలిసిన అందరినీ ఆ కార్యక్రమానికి ఆహ్వానించినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కాగా.. ఢిల్లీ పర్యటనలో సీఎం రేవంత్ బిజీబిజీగా గడిపారు. ఈరోజు ఉదయం పార్లమెంట్‌లో ఏఐసీసీ అధక్షులు మల్లికార్జునఖర్గేతో పాటు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీతో సమావేశమయ్యారు. ఇటీవల రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిణామాలు, గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించిన అంశాలను వారి దృష్టి తీసుకెళ్లారు. గ్లోబల్ సమ్మిట్‌ను ఏ విధంగా విజయవంతం చేశామనే అంశాలపై చర్చించారు. ఆపై ఢిల్లీ పర్యటనను ముగించుకుని సీఎం హైదరాబాద్‌కు పయనమయ్యారు.

# మీకంటే అసదుద్దీన్ ఓవైసీ బెటర్..

## తెలంగాణ బీజేపీ ఎంపీలపై మోడీ సీరియస్



హైదరాబాద్ : తెలంగాణ బీజేపీ ఎంపీలపై ప్రధాని మోడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్డీఏ ఎంపీలతో మోడీ అల్పాహార విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన.. తెలంగాణలో బీజేపీ ఎంపీలు సరైన ప్రతిపక్షపాత్ర పోశించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పార్టీ ఎందుకు వెనుకబడిందని ప్రశ్నించారు. ప్రజల్లో మంచి ఆదరణ ఉన్నా తెలంగాణలో వెనకబడటంపై అసంతృప్తి వ్యక్తం వ్యక్తం చేశారు. ఇకనైనా విబేధాలు వీడి ఉమ్మడిగా పనిచేయాలని హితవుపలికారు.

రాష్ట్రంలో పార్టీ గ్రాఫ్ పెరిగేలా కృషి చేయాలని సూచించారు. అంతేకాకుండా అసదుద్దీన్ సోషల్ మీడియా టీమ్ యాక్టివ్ గా పనిచేస్తోందని ఉదాహరించారు.

ఎంపీల తీరు మారాలని, సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండాలని హితబోధ చేశారు. ఏపీలో చంద్రబాబు పాలన బాగుందని ప్రశంసలు కురిపించారు. అందుకే ఏపీకి పెట్టుబడులు ఎక్కువగా వస్తున్నాయని చెప్పారు. ఇదిలా ఉంటే తెలంగాణలో మొత్తం ఎనిమిదిమంది బీజేపీ ఎంపీలు ఉన్న సంగతి తెలిసిందే.

అంటే రాష్ట్రంలో అధికార కాంగ్రెస్‌తో సమానంగా బీజేపీ ఎంపీలు ఉన్నారు. కానీ రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడంలో బీజేపీ ఎంపీలు విఫలం అవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. పార్టీ బలోపేతం విషయంలోనూ పెద్దగా దృష్టి పెట్టడంలేదనే విమర్శలు సైతం వస్తున్నాయి. ఇక ప్రధాని క్లాస్ తో ఎంపీల పనితీరులో మార్పు వస్తుందా లేదా అనేది చూడాలి.





# 13లక్షల ఉద్యోగాలు..

## అదిరిపోయే ప్రకటనతో...

# నిరుద్యోగులకు కొత్త ఆశలు!

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధి పైన ఫోకస్ చేస్తుంది. ఈ మేరకు తాజాగా జరిగిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి ప్రణాళికలను సైతం ప్రకటించింది.

ఇదే సమయంలో నిరుద్యోగులకు కూడా శుభవార్త చెప్పింది తెలంగాణ సర్కార్. మూడు ట్రిలియన్ డాలర్స్ తెలంగాణ భారత్ ఫ్యూచర్ సిటీ భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి ప్రణాళికలను ప్రకటించిన ప్రభుత్వం 13,500 ఎకరాలలో అంతర్జాతీయ, దేశీయ పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో, అద్భుతమైన మౌలిక సదుపాయాలతో, జీరో కార్బన్ సిటీగా భారత్ ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకుంటుందని వెల్లడించింది. మూడు ట్రిలియన్ డాలర్స్ తెలంగాణ భారత్ ఫ్యూచర్ సిటీ అనే అంశం పైన మాట్లాడిన మంత్రి శ్రీధర్ బాబు ఈ ప్రణాళికలను వెల్లడించారు.

13 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు భారత్ ఫ్యూచర్ సిటీ నగరం ఆరు అర్బన్ జిల్లాలుగా రూపుదిద్దుకుంటుందని చెప్పిన శ్రీధర్ బాబు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, హెల్త్ సిటీ, ఎంటర్టైన్మెంట్ క్రీడలు, డేటా సెంటర్లు, అంతర్జాతీయ ఉన్నత విద్యా సంస్థల కోసం ప్రత్యేకంగా ఈ ఆరు జిల్లాలను నెలకొల్పనున్నట్టు చెప్పారు. దీంట్లో మొత్తం 13 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు తీపి కబురు ఈ వార్త ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగులకు తీపి కబురుగా మారింది. దాదాపు తొమ్మిది లక్షల మంది జనాభా కోసం నివాస గృహ సముదాయాలను కూడా నిర్మిస్తామని, వీటిని నిర్మాణ రంగ నిపుణులు అభివృద్ధి చేస్తారని చెప్పడం, ఎంతోమందికి ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని చెప్పడానికి అవకాశం ఇచ్చింది.

**త్వరలోనే స్కిల్ యూనివర్సిటీ.....** యువత భవిష్యత్ కు భరోసా మొత్తంగా తాజాగా తెలంగాణ ప్రభుత్వం భారత్ ఫ్యూచర్ సిటీ ఏర్పాటుతో తీసుకున్న నిర్ణయం తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ భరోసా కల్పిస్తుంది అన్న అభిప్రాయం సర్వత్ర వ్యక్తమౌతుంది. మరో నెల రోజుల్లో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ కార్యక్రమాలు కూడా ప్రారంభమవుతాయని ఇటీవల ప్రకటించడం కూడా యువతకు సంతోషాన్ని కలిగించింది. ఏది ఏమైనా యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వీరి ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు దోహదం చేస్తే బావుంటుంది అన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

# సంపాదకీయం

## భారత్ విషయంలో మారిన ట్రంప్ స్వరం..

## జాతకం చెబుతున్నారా?

జరిగింది చెబుతాము, జరబోయేది చెబుతాము అన్నట్లుగా భారత్ తీసుకునే నిర్ణయాలు, చేసే పనుల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జాతకాలు చెప్పినట్లుగా మాట్లాడుతున్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు విషయంలో ఇప్పటికే చాలా సార్లు మాట్లాడిన ట్రంప్.. ఈ సారి మాత్రం స్వరం కాస్త మార్చారు.. ఫ్యూచర్ టెన్స్ లో మాట్లాడారు. ఈ సందర్భంగా మోడీపై ప్రశంసలు కురిపించారు. అవును... అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ ను ఉద్దేశిస్తూ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోడీని ప్రస్తావిస్తూ కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో రష్యా చమురు కొనుగోళ్ల విషయంపై స్పందిస్తూ... ఆ దేశ చమురు కొనుగోళ్లను భారత్ నిలిపివేసిందంటూ గతంలో ప్రకటించిన ఆయన... తాజాగా భారత్ పెద్ద మొత్తంలో చమురు కొనబోదంటూ వ్యాఖ్యానించారు. మొన్నటివరకు రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ నిలిపివేసిందంటూ స్వయంగా ప్రకటించేసిన ట్రంప్.. తాజాగా మాట్లాడుతూ.. రష్యా నుంచి భారత్ భారీగా చమురు కొనబోదని వ్యాఖ్యానించారు. అందుకు కారణం... తనలాగానే మోడీ కూడా ఉక్రెయిన్ – రష్యాల మధ్య యుద్ధం ముగియాలని కోరుకుంటున్నారని ట్రంప్ అన్నారు. అయితే.. దీనిపై భారత్ ఏమాత్రం స్పందించలేదు!

**వైట్ హౌస్ లో దీపావళి!:** స్థానిక కాలమానం ప్రకారం.. వైట్ హౌస్ లో దీపావళి వేడుకలు నిర్వహించారు. ఇందులో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తో సహా కీలక అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారతీయ – అమెరికన్లకు ట్రంప్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. తనకు భారతీయులంటే చాలా ఇష్టమని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో భారత ప్రధాని నరేంద్ర మోడీపై ప్రశంసలు కురిపించారు. ఇందులో భాగంగా... ఆయన గొప్ప వ్యక్తి అని, గొప్ప స్నేహితుడని కొనియాడారు. మోడీతో తాను ఫోన్ లో మాట్లాడినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తమ మధ్య గొప్ప సంభాషణ జరిగిందని.. అనేక విషయాల గురించి తాము మాట్లాడుకున్నామని.. ప్రధానంగా వాణిజ్యం గురించి చాలాసేపు చర్చించామని.. ఆయనకు దానిపై చాలా ఆసక్తి ఉందని ట్రంప్ పేర్కొన్నారు. అయితే.. ట్రంప్, మోడీల ఫోన్ సంభాషణ గురించి భారత్ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు.

**భారత్ – అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం!:** భారత్ – అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం అతిత్వరలో ఖరారయ్యే సంకేతాలు కన్పిస్తున్నాయని జాతీయ మీడియాలో కథనాలొస్తున్నాయి. ఈ ఒప్పందంతో భారత్ పై ట్రంప్ టారిఫ్ లు భారీగా దిగి రానున్నట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. ఈ క్రమంలో.. ప్రస్తుతం 50శాతం ఉన్న టారిఫ్ లు.. 15-16 శాతానికి తగ్గే అవకాశం ఉందని అంటున్నారు. మరోవైపు కేంద్ర ప్రధాన ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వరన్ కూడా వాణిజ్య ఒప్పందం ఖరారుపై విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందానికి సంబంధించి తన వద్ద ఎలాంటి ఇన్ సైడర్ సమాచారం లేదు కానీ... రాబోయే రెండు నెలలు లేదా అంతకంటే ముందే ఇరు దేశాలు సమస్యలను పరిష్కరించుకుని ఒప్పందంపై ఏకాభిప్రాయానికి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నట్లు తెలిపారు.

# తమ గురుకులం సమస్యలను పరిష్కరించాలంటూ రోడ్ ఎక్కిన విద్యార్థులు

## అన్నంలో, కూరల్లో పురుగులు నాణ్యత లోపం....

## మౌలిక వసతులు మరింత ఘోరమంటూ...

### శామీర్ పేట పోలీస్ స్టేషన్ కు ర్యాలీగా వెళ్ళి పిర్యాదు చేసిన గురుకుల విద్యార్థులు



శామీర్ పేట, డిసెంబరు 11 ( గరుడ వార్త) : గురుకుల పాఠశాల సమస్యలు పరిష్కరించాలంటూ విద్యార్థులు వినూతనంగా పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఫిర్యాదు చేశారు. శామీర్ పేట పరిధిలోని అమీనా కళాశాలలో మహాత్మ జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ వెల్ఫేర్ కు చెందిన మూడు గురుకుల పాఠశాలలు అద్దెకు నడుస్తున్నాయి. ఈ గురుకుల పాఠశాలల విద్యార్థులు తమ సమస్యలను పరిష్కరించాలంటూ గురువారం శామీర్ పేట ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ఎంతో క్రమశిక్షణతో విద్యాబుద్ధులు నేర్పాల్సిన టీచర్లు దౌర్జన్యంగా కొడుతు, బూతులు తిడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారు తిట్టే బూతుమాటలను బరించలేక పోతున్నామని విద్యార్థులు పోలీసులకు తెలిపారు. అరకొర వసతులతో నిత్యం బాదలను పడుతు గురుకులాల్లో ఉండలేక పోతున్నామని విద్యార్థులు వెల్లడించారు. కాగా ఈ మూడు గురుకుల పాఠశాలలకు ఒకే ప్రిన్సిపల్ డాక్టర్ వై రవికుమార్, డిప్యూటీ వార్డెన్(డిడబ్ల్యు) గా విధులను నిర్వర్తిస్తున్నారు. దాదాపు 60 మంది గురుకులాల విద్యార్థులు ర్యాలీగా శామీర్ పేట పోలీస్ స్టేషన్ కు తరలి వెళ్ళి ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ కు వారు నిత్యం పడుతున్న బాదలు, సమస్యల గురించి వివరించారు. ఆ గురుకులాల్లో ఉన్న మరుగుదొడ్లకు డోర్లు, ట్యాప్ వాటర్, పరిశుభ్రం లేక గత ఆరు నెలలుగా ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు పోలీసులకు తెలిపారు. అధిక ఫ్లోరైడ్ ఉన్నందువల్ల శరీరానికి దురద, పుండ్లు, దద్దుర్లు వస్తున్నాయని, వాటితో తీవ్ర ఆనారోగ్యానికి గురవుతున్నామని విద్యార్థులు పోలీసులకు చెప్పారు. అలాగే గురుకులంలో పాఠాలను బోధిస్తున్న ఇద్దరు టీచర్లు మహేందర్, గోపాల్, డిప్యూటీ వార్డెన్ ఓంప్రకాశ్ లు మమ్మల్ని గత ఆరు నెలలుగా ఇష్టమొచ్చినట్లుగా కొడుతు, దుర్భాషలాడుతు, వేధిస్తున్నారని, వారు పెడుతున్న బాదలను మేము భరించలేక పోతున్నామని విద్యార్థులు పోలీసులకు వివరించారు. అలాగే మాకు పెడుతున్న భోజనాలను సరిగ్గా పెట్టడంలేదని, అన్నంలో, కూరల్లో రాళ్ళు, పురుగులు వస్తున్నాయని, ఆ భోజనాన్ని మేము తినలేక పోతున్నామని, మధ్యాహ్నం వండిన అన్నం రాత్రికి పెడుతున్నారని, పాడైపోయిన ఆ అన్నం మేము తినలేక పోతున్నామని, అర్థఆకలితో అలమటిస్తున్నామని విద్యార్థులు గోడు వెల్లబోసుకున్నారు. ఈ అక్రమాల




తంతు పట్ల గురుకుల ప్రిన్సిపల్ రవికుమార్ కు ఎన్నోసార్లు మొరపెట్టుకున్న పట్టి పట్టినట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కాగా పోలీస్ స్టేషన్ కు వెళ్ళి గురుకుల పాఠశాలకు చేరుకున్న విద్యార్తులు దాదాపు 500 మంది ఆ పాఠశాల ఆవరణలో బైఠాయించి పెద్ద ఎత్తున ఆంధోళన చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మా సమస్యలను పరిష్కరించాలని, నిర్లక్ష్యంలో ఉన్న గురుకుల ప్రిన్సిపల్, మమ్మల్ని వేధించి కొట్టిన ఇద్దరు టీచర్లు మహేందర్, గోపాల్, వార్డెన్ ఓంప్రకాశ్ పై కఠిన చర్యలను తీసుకుని మాకు న్యాయం చేయాలని బాధిత విద్యార్థులు పెద్ద పెట్టున నినాదాలను చేస్తు ఆందోళన చేశారు.

**గురుకుల పాఠశాలలను సందర్శించి సమస్యలను తెలుసుకున్న అధికారులు....** కాగా గురుకుల పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోలీస్ స్టేషన్ కు వెళ్ళిన సమాచారాన్ని తెలుసుకున్న అధికారులు వెంటనే శామీర్ పేట గురుకుల పాఠశాలలను సందర్శించి పరిశీలించారు. గురుకుల బీసీ పాఠశాలల ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రాంతీయ కోఆర్డినేటర్(ఆర్సీఓ) రాజేశ్ కుమార్, జిల్లా సివిల్సప్లై అధికారి (డీసీఓ) శ్రీనివాస్ రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి జాన్సీరాణి, శామీర్ పేట రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాఘవ, శామీర్ పేట పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ సోమిరెడ్డిలు గురుకుల పాఠశాలలకు వెళ్ళి విద్యార్థులు నిత్యం అనుభవిస్తున్న నరకయాతన బాదల పూర్వాపరాలపట్ల విచారణ జరిపారు.

# అయ్యప్ప స్వామి నామస్మరతో మారు మోగిన శామీర్పేట శివాలయ ప్రాంగణం

## ఘనంగా కన్నుల పండువగా అయ్యప్ప స్వామి 18 వ మహా పడిపూజ







శామీర్ పేట, డిసెంబర్ 11( గరుడ వార్త ) : అయ్యప్ప స్వామి శరణు ఘోషతో శివాలయ ప్రాంతం మారు మోగింది. బుధవారం రాత్రి మండల కేంద్రం శామీర్ పేట శివాలయం ముందర అయ్యప్ప స్వామి 18 వ మహా పడిపూజ అంగరంగ వైబోగంగా జరిగింది. శామీర్ పేటకు చెందిన కనకాల బల్ రాం గురు స్వామి (18వ పడి), కనకాల సాయి చరణ్ స్వామి( కన్నె స్వామి )లు అయ్యప్ప స్వామి మహా పడిపూజను అయ్యప్ప అవధూత శ్రీశ్రీ రాంపిళ్ళ లక్ష్మణరావు గురుస్వామి, కీ. శే. చక్రపాణి గురుస్వామి ఆశీస్సులతో పద్మారావు గురుస్వామి, ప్రభాకర్ గురు స్వామి, ఆంజనేయులు గురుస్వాముల సమక్షంలో అయ్యం గారు గురుస్వామి అయ్యప్ప స్వామి మహా పడి పూజను నిర్వహించారు. అయ్యప్ప స్వామి ని బల్ రాం గురుస్వామి తన నివాసం నుంచి మంగళ హారతులతో ఊరేగింపుగా తీసుకువచ్చి పూజా స్థలంలో ఏర్పాటు చేశారు. శామీర్ పేట మండలం, మూడు చింతలపల్లి మండలాల తోపాటు వివిధ ప్రాంతాల అయ్యప్ప మాల ధారణ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కీసర మండలం చీర్యాలకు చెందిన శ్రీ సాయి మణికంఠ భజన మండలి ఆధ్వర్యంలో లింగయ్య గురుస్వామి ఆలపించిన భక్తి గీతాలు భక్తులను ఆకట్టుకున్నాయి. మాల ధారణ స్వాములతో పాటు అయ్యప్ప భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# పారాత్రోబాల్ పోటీల్లో సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్న భారత్





శామీర్ పేట, డిసెంబర్ 11( గరుడ వార్త ) : ధీరావత్ మహేష్ నాయక్ పారా త్రో బాల్ లో పోటీల్లో భారతదేశానికి సిల్వర్ మెడల్ తీసుకురాగలిగారు. ఈనెల 6 వ తేది నుంచి 9 వ తేది వరకు శ్రీలంకలో మొదటి సౌత్ ఏషియా చాంపియన్షిప్ దివ్యాంగుల పోటీలు జరిగాయి. ఇందులో భారత దేశానికి పారాత్రో బాల్స్ లో సిల్వర్ మెడల్ లభించింది. ఈ పోటీలలో భారతదేశం పారాత్రో బాల్ జట్టు కెప్టెన్ గా మేడ్చల్ జిల్లా మూడు చింతలపల్లి మండలం లింగాపూర్ తండాకు చెందిన దిరావత్ మహేష్ నాయక్ ను ఎన్నుకున్నారు. కాగా భారతదేశం బంగ్లాదేశ్, నేపాల్, ఇండోనేషియా, పాకిస్తాన్ జట్లను ఓడించి ఫైనల్లో శ్రీలంకతో తలపడింది. ఈ మ్యాచ్లో భారతదేశం ద్వితీయ స్థానంలో నిలిచింది.

మొదటి స్థానంలో శ్రీలంక, రెండవ స్థానంలో భారతదేశం, మూడో స్థానంలో బంగ్లాదేశ్ మెడల్స్ ను దక్కించుకున్నాయి. ఈ పోటీలను శ్రీలంక లో రత్నాపుర గవర్నర్ ప్రారంభించగా పథకాలను వరల్డ్ పారా త్రోబాల్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ నీలిమ రావత్ అందజేశారు. కాగా సిల్వర్ మెడల్ ను సాధించిన మహేష్ కుమార్ ను పలువురు అభినందించారు.

# పొదుపు బాట.. ఆర్థిక సాధికారత

పెద్దపల్లి : స్వయం సహాయక సంఘాల మహిళలకు స్త్రీనిధి రుణాల పంపిణీలో జిల్లా అగ్రపథంలో దూసుకెళ్లింది. కలెక్టర్ శ్రీహర్ష పర్యవేక్షణలో అధికారులు క్రమం తప్పకుండా సమీక్షించడం, ఆపదలో రుణాలు అందించడంతో ఈ ఘనత సాధ్యమైంది. ఈ వార్షిక ఏడాదికి సంబంధించి రాష్ట్రంలో జిల్లా ముందు వరసలో నిలిచింది. రుణాలు కోరిన 48 గంటల్లోపు పంపిణీ చేయడంలో లక్ష్యాలకు చేరుతోంది.

**రూ.5 లక్షలలోపు..**

2011లో స్త్రీనిధి రుణాల పథకానికి శ్రీకారం చుట్టగా స్వశక్తి సంఘాల్లోని మహిళలకు సువిధ, ప్రగతి, అక్షయ, సౌభాగ్య, ఐశ్వర్య పేరిట రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు పంపిణీ చేస్తున్నారు. చిన్నతరహా, కుటీర పరిశ్రమలు, వ్యవసాయం, కిరాణ, వస్త్ర వ్యాపారం చేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రోత్సహిస్తున్నారు. పావలా వడ్డీ వెసులుబాటు కల్పించడంతో క్రమం తప్పకుండా రుణ కిస్తీలు చెల్లించడంతో ముందుంటున్నారు.

**ఫలించిన సమష్టి శ్రమ**

ఈ ఏడాది స్త్రీనిధిలో రూ.51.56 కోట్ల రుణ లక్ష్యం విధించగా ఇప్పటి



వరకు రూ.37.24 కోట్లు పంపిణీ చేశారు. 72.23 శాతం నమోదైంది.

జిల్లా వివరాలు

రుణ లక్ష్యం : 51.56 కోట్లు

పంపిణీ : రూ.37.24 ”

స్వశక్తి సంఘాలు : 1,229

సభ్యులు : 3,896

అందరి సహకారంతో..

జిల్లాలో రుణ లక్ష్యాలపై మొదటి నుంచి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. మండలాల్లో గ్రామైఖ్య సంఘాల పరిధిలోని మహిళల అవసరాలకు తీర్చేందుకు సకాలంలో రుణాలు పంపిణీ చేస్తున్నారు. అందరి సహకారంతో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఇదే స్ఫూర్తితో గడువులోపు లక్ష్యాలు చేరుకునేందుకు శ్రమిస్తాం.


దుర్గాప్రసాద్, స్త్రీనిధి రీజినల్ సమన్వయకర్త

# దేవాదాయ భూమి.. పట్టించుకోరేమి?

కామారెడ్డి : నాగిరెడ్డిపేట మండలం తాండూరులోని పురాతన త్రిలింగేశ్వర, దాని పక్కనే ఉన్న గోపాలస్వామి, అక్కంపల్లి గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ భూములు అన్యాక్రాంతమయ్యాయి. దేవాలయాలకు ఏళ్ల క్రితం పలువురు భక్తులు వివిధ సర్వే నంబర్లలో 10 ఎకరాల భూమిని విరాళంగా ఇచ్చారు. అనంతరం కొందరు ఆక్రమణదారులు వాటిని కబ్జా చేసి అందులో సాగు చేస్తున్నారు. కౌలు చెల్లించకపోగా.. కనీసం తామే సాగు చేస్తున్నామనే విషయాన్ని కూడా ఎవరూ చెప్పడం లేదు. ఏళ్లు గడుస్తున్నా ఆ భూములు ఎక్కడ, ఎవరి అధీనంలో ఉన్నాయి. ఎవరు సాగు చేసుకుంటున్నారో దేవాదాయ, రెవెన్యూ అధికారులకు సమాచారమే లేదు.

అక్రమంగా పట్టా చేసుకునే ప్రయత్నం

మండలంలోని తాండూరు, వెంకంపల్లి, ధర్మారెడ్డి, అక్కంపల్లి గ్రామాల



పరిధిలో 14 సర్వే నంబర్లలో ఈ దేవాలయాల భూమి ఉంది. ఆయా శాఖల నిర్లక్ష్యాన్ని ఆసరాగా చేసుకున్న పలువురు భూముల్లో వాలిపోయారు. ఆ దేవాలయంలో గతంలో పనిచేసిన ఓ ఉద్యోగి, ఆయన కుటుంబసభ్యులు వారి పేరు మీద పట్టా చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఆ గ్రామాల్లో ఎకరా రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ధర పలుకుతోంది. మిగతా భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు.

**అధికారులు ఏమన్నారంటే..**

‘ఆ భూముల్ని నిషేధిత జాబితాలో పెట్టాం. అవి దేవాదాయశాఖ పరిధిలో లేవు. గ్రామస్థులు లేఖ రాస్తే మేం చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉండేది’ అని తహసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు.

‘దేవాలయ భూములు నిషేధిత జాబితాలోనే ఉన్నాయి. ఇతరుల ఆధీనంలో ఉన్నాయని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లాం. వాటిని స్వాధీనం చేసుకోవాలని లేఖ రాశాం’ అని దేవాదాయశాఖ కార్యనిర్వహణ

# మద్యం దాహం.. కుటుంబాలు ఆగం

మద్యం తాగితే మనిషి విచక్షణ కోల్పోతాడు. కానీ జిల్లాలో ఏకంగా ప్రాణాలనే కోల్పోతున్నారు. మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వడం లేదని, దొరకడం లేదని యువత అప్పులు చేస్తున్నారు. వీటిని తీర్చలేక ప్రాణాలు విడుస్తూ వారినే నమ్ముకున్న కుటుంబాలను కష్టాల సుడిగుండంలోకి నెట్టేస్తున్నారు.

డీ అడిక్షన్ కేంద్రాలేవి? మద్యానికి బానిసైన వారిలో మార్పు తేవాలంటే డీ అడిక్షన్ కేంద్రాలతోనే సాధ్యం. వీటిని ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించి ఆరునెలలు దాటుతున్నా అమలుకు నోచుకోలేదు. పోలీసులు-ఆబ్కారీ శాఖ అధికారులు కౌన్సెలింగ్‌లు నిర్వహిస్తున్నా అనుకున్న రీతిలో ఫలితాలు రాబట్టలేకపోతున్నారు. ‘మద్యం మూలాలను అరికట్టేందుకు నిరంతర నిఘా కొనసాగిస్తున్నాం. జూదం, గంజాయి, అల్ప్రాజోలం వంటి మత్తు పదార్థాల కట్టడికి వ్యవస్థను రూపొందించాం. మత్తు పదార్థాలు, మద్యం, కల్తీ కల్లుకు బానిస కాకుండా ప్రజల్లో చైతన్యం తెస్తున్నాం.’ అని జిల్లా ఎస్పీ రాజేష్‌చంద్ర అన్నారు. భార్య, పిల్లలకు బతుకు భారం: ‘గాంధారికి చెందిన యువకుడు ఓడుసుల చిరంజీవి (30) వ్యవసాయంతోనే కుటుంబ పోషణ చేస్తుండేవాడు. మద్యానికి బానిసైన అతడు గత నెల 31వ తేదీన పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆయనే ఆధారంగా బతుకుతున్న భార్య, ఇద్దరు పిల్లలకు ఇప్పుడు జీవితం భారమైంది.’ ఈ తండ్రికి శోకం: ‘నాగిరెడ్డిపేట మండలం తాండూర్‌కు చెందిన కుమార్ (18) తాగుడుకు బానిసై ఇంట్లోవారితో తరచూ గొడవపడేవాడు. మద్యం మత్తులో కన్నతండ్రిని అనరాని మాటలనడంతో చుట్టుపక్కలవారు మందలించారు. మనస్తాపం చెందిన కుమార్ గత నెల 22వ తేదీన ఇంట్లో ఉరేసుకొని చనిపోయాడు. చేతికందిన కొడుకును మద్యం రక్కసి కబలించిన తీరును తలచుకొని తండ్రి సంగయ్య ఇప్పటికీ రోధిస్తున్నారు.’ వీరికి దిక్కేది?: శేరిబీబీపేటకు చెందిన బోడ సునీల్ (30) మద్యానికి బానిసై భార్యతో తరచూ గొడవపడేవాడు. ఈ నెల 10న గొడవపడి ఇంటి నుంచి వెళ్లి గడ్డి మందు తాగి చనిపోయాడు. దీంతో అతడి భార్య, కూతురు దిక్కులేని వారయ్యారు. దుష్పరిణామాలు ఇవే.. మత్తులో జూదం ఆడడం, దొంగతనాలు-దోపిడీలు, అసాంఘిక కార్యకలాపాలు, నేరాలకు పాల్పడి కటకటాలపాలవుతున్నారు.

# ఇదీ.. తెల్లదొరల ఏనుగుల బంగ్లా..!

భద్రాచలం : వందేళ్లయినా చెక్కుచెదరని వైభవంతో ఎత్తయిన ప్రాంతంలో రాజసంగా కనిపిస్తోంది ఏనుగుల బంగ్లా. ఇప్పటికీ దీన్ని అటవీశాఖ తమ కార్యకలాపాలకు వినియోగిస్తుండటం గమనార్హం. అటవీశాఖ విశ్రాంత ఉద్యోగుల కథనం ప్రకారం.. 1920 నుంచి 1925 మధ్యకాలంలో భద్రాచలం మార్కెట్ వెనుక వైపున మేదర్‌బస్తీకి సమీపంలో ఏనుగుల బంగ్లా నిర్మించారు. గోడల నిర్మాణానికి మట్టిని మాత్రమే ఉపయోగించారు. భద్రాచలం దండకారణ్యంలో లభించిన నాణ్యమైన టేకు కలపతో పైకప్పు ఏర్పాటుచేశారు. గాలి, వెలుతురు వచ్చేలా కిటికీలను అమర్చారు. అప్పట్లో తెల్లదొరలు తమ పాలన నిమిత్తం అటవీ ప్రాంతాల్లో అక్కడక్కడా విడిది చేసేవారు. వందేళ్ల క్రితం భద్రాచలం రామాలయం పరిసరాలతో పాటు చుట్టుపక్కల వందల సంఖ్యలోనే జనాభా ఉండేవారట. భద్రాచలంలో ఎటుచూసినా కీకారణ్యం కనిపించటంతో ఎత్తుగా ఉండే ఈప్రాంతాన్ని గుర్తించి బంగ్లా నిర్మించారు.



**భద్రాచలం అడవిలో తిరిగేందుకు..**

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో ఇక్కడ కొలువు చేయాలంటే శిక్షగా భావించేవారనే ప్రచారం సాగేది. ఆ రోజుల్లో.. భద్రాచలం కాకులు దూరని కారడవిని తలపించేది. దీనిని చరిత్రకారులు శంకరగిరి మాన్యంగా చెబుతుంటారు. వందేళ్ల క్రితం ఇక్కడ అడవుల్లో తిరిగేందుకు ఏనుగులను తెల్లదొరలు సాధనాలుగా ఉపయోగించుకున్నారు.


పెద్దఎత్తున ఆంగ్లేయులు వచ్చినప్పుడు ఎక్కువ సంఖ్యలో ఏనుగులను ఈ బంగ్లా వెలుపల ఇనుప దిమ్మెలకు కట్టేసేవాళ్లు. అందుకే దీనికి ఏనుగుల బంగ్లా అని పేరొచ్చింది.

చిన్నపాటి మరమ్మతులకు గురైనా ఇప్పటికీ చెక్కుచెదరకుండా కనిపిస్తున్న ఈ బంగ్లా నాటి ఇంజినీరింగ్ ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తోంది. ప్రస్తుతం అటవీశాఖ పరిధిలో ఉంది. ఎకరం స్థలంలోని బంగ్లాను చారిత్రక కట్టడంగా గుర్తించేందుకు ఆ శాఖ ప్రయత్నిస్తోంది.

తెల్లదొరలు తమ కుటుంబ సభ్యులతో పర్యటించేందుకు ఏనుగుల బంగ్లా నుంచి ఏడు గుర్రాలపై స్వారీ చేస్తూ ప్రస్తుతం ఏపీలోని చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లికి చేరుకుని అక్కడ బస చేసేవారట. ఏడు గుర్రాలతో అక్కడ బసచేయటం వల్లే ఆ గ్రామానికి తొలుత ఏడుగుర్రాళ్లపల్లి.. కాలక్రమేణా ఏడుగురాళ్లపల్లి అనే పేరొచ్చిందన్న ప్రచారం జరుగుతోంది.

# మెట్టు దిగరు.. బెట్టు వీడరు

సంగారెడ్డి : జిల్లాలో తొలి, మలి విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థులు ఖరారయ్యారు. పల్లెల్లో స్థానిక పోరు నువ్వా నేనా అన్నట్లుగా సాగుతోంది. ఈ ఎన్నికలు పార్టీలకు సంబంధం లేనప్పటికీ.. అభ్యర్థులకు మద్దతు ఇస్తున్నాయి. ఆయా పార్టీల మద్దతుదారులే గెలుపొందేలా నేతలు వ్యూహాలు పన్నుతూ.. అమలు చేస్తున్నారు. ఓ వైపు ఇందంతా జోరుగా సాగుతున్నప్పటికీ.. ప్రధాన పార్టీలకు రెబల్స్(తిరుగుబాటుదారులు) అభ్యర్థులు తలనొప్పిగా మారారు. కొన్ని గ్రామాల్లో ఒకే పార్టీ మద్దతుదారులుగా ఇద్దరు, ముగ్గురు ఒకే పదవికి పోటీ పడుతున్నారు. వారిలో కొందరిని బరిలోంచి తప్పించేందుకు నేతల బుజ్జగింపులు చాలా చోట్ల ఫలించడం లేదు. రెబల్స్ అలాగే కొనసాగితే ప్రత్యేర్థి పార్టీల మద్దతుదారులు గెలుస్తారేమోనని నాయకులు ఆందోళన చెందుతున్నారు.



**ఒక్కోచోట.. ఒక్కోలా..**

హత్నూర మండలంలోని తుర్కల ఖానాపూర్‌లో కాంగ్రెస్ మద్దతుదారులు ముగ్గురు సర్పంచి అభ్యర్థులుగా బరిలో నిలిచారు. ఇక్కడ భారాస, భాజపా మద్దతుదారులు పోటీకి దూరంగా ఉన్నారు. ఇదే మండలంలోని చింతల్ చెరులో భారాస మద్దతుదారులు ఇద్దరు సర్పంచి అభ్యర్థులుగా బరిలో నిలిచారు. ఈ మండలంలోని చాలా గ్రామాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీలకు రెబల్స్ నేతలకు తలనొప్పిగా మారారు. కొండాపూర్ మండలం మల్కాపూర్, గొల్లపల్లి, మారేపల్లి, తెర్పోల్, అనంతసాగర్ గ్రామాల్లో ఇద్దరు చొప్పున ప్రధాన పార్టీల మద్దతుదారులు సర్పంచి పదవికి పోటీ పడుతున్నారు.

జహీరాబాద్ మండలం హుగ్గెల్లి, శేఖాపూర్, దిడ్గిలో కాంగ్రెస్ మద్దతుదారులు ఇద్దరు చొప్పున పోటీపడుతున్నారు. మొగుడంపల్లి మండలం రాయిపల్లి తండాలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

అందోలు మండలంలోని నేరడిగుంట, సంగుపేట, పోతిరెడ్డిపల్లిలో ప్రధాన పార్టీలకు రెబల్స్ బెడద నెలకొంది.

# 'మహా'లో అలా.. మన దగ్గర ఇలా..

ఆదిలాబాద్): ప్రస్తుతం ఎక్కడ చూసినా పంచాయతీ ఎన్నికల ముచ్చట్లే.. అయితే ఉమ్మడి జిల్లాలోని చాలా గ్రామాలు మహారాష్ట్ర సరిహద్దులో ఉండటంతో మహారాష్ట్ర వాసులు ఇక్కడి ఎన్నికలపై ఆసక్తి కనబరుస్తున్నారు.. అక్కడ, ఇక్కడ పంచాయతీల పనితీరు, పథకాల అమలులో చాలా తేడాలుంటాయి. ఇవి ఆసక్తిని కలిగిస్తాయి. ఈ నేపథ్యంలో మహారాష్ట్రలో ఒక పంచాయతీని సందర్శించి.. పాలన, ఎన్నికల విధానం, నిధులు, అభివృద్ధి, ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలించింది... మహిళలకు ప్రత్యేకంమన రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేస్తున్నారు. అదే మహారాష్ట్రలో 50శాతమే రాయితీ ఉంది. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే బాలికలకు ఉచిత బస్సు సౌకర్యం ఉంది. వాళ్ల కోసం ప్రత్యేకంగా బస్సులు నడుపుతారు. ఇటీవల కుటుంబంలో ఒక మహిళకు నెలకు రూ.1500 చొప్పున ఇస్తున్నారు. ఒకేసారి ఎన్నికలు ఉండవుమన గ్రామాలకు, అక్కడి పల్లెలకు చాలా తేడా ఉంది. ఎన్నికలు, పథకాల అమలు తీరు భిన్నంగా ఉంది.. గతంలో మహారాష్ట్రలో సర్పంచి ఎన్నిక పరోక్ష పద్ధతిలో ఉండేది. కొన్నేళ్లుగా అక్కడా ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నికలు జరుగుతున్నాయి. మొత్తం ఒకే దఫా కాకుండా, పాలకవర్గం ముగిసిన దాన్ని బట్టి ఎన్నికలు నిర్వహిస్తారు. ఐదేళ్ల కాలపరిమితి ముగిసిన వాటికి ఒక విడతలో, మళ్లీ కాలపరిమితి ముగిసిన వాటికి రెండో విడత.. ఇలా మూడు విడతల్లో ఎన్నికలు జరుగుతాయి.

# ఆర్థిక వనరులు.. పల్లె ప్రగతికి మెట్లు



కరీంనగర్ : జిల్లాలోని గ్రామాల్లో పాలకులను ఎన్నుకొనే ప్రక్రియ పోటాపోటీగా జరుగుతోంది. మరో 15 రోజుల్లో ఎన్నికల ప్రక్రియ మొత్తం ముగిసి గ్రామాలకు కొత్త పాలక వర్గాలు కొలువుదీరుతాయి. అయితే గ్రామ పాలన సక్రమంగా నడవాలంటే ఆర్థిక వనరులు అవసరమవుతాయి. అయితే గ్రామంలో నిత్యం జరిగే పనుల నిర్వహణకు ఏయే పద్దుల నుంచి డబ్బులు వస్తాయి. గ్రామాభివృద్ధికి ఎక్కడి నుంచి నిధులు వస్తాయి. తదితర అంశాలపై ప్రత్యేక కథనం.

**కేంద్ర ఆర్థిక సంఘం**

గ్రామాల సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర ఆర్థిక సంఘం ఈ నిధులు విడుదల చేస్తుంది. గ్రామాల్లో అభివృద్ధి పనులకు వీటిని వినియోగించాల్సి ఉంటుంది. జనాభా ప్రాతిపదికన గ్రామంలో ప్రతి ఒక వ్యక్తికి రూ.80 నుంచి రూ.90 చొప్పున ప్రతి మూడు నెలలకోసారి కేటాయిస్తుంది. పాలకవర్గం కొలువుదీరి ఉంటేనే ఈ నిధులు విడుదలవుతాయి. గత 18 నెలలుగా గ్రామాలకు పాలకవర్గాలు లేకపోవడంతో ఈ నిధులు రాలేదు.

**ఉపాధి హామీ నిధులతో..**

గ్రామపంచాయతీ పరిధిలో చేపట్టిన ఉపాధి హామీ పనుల కోసం ప్రత్యేకంగా కేంద్రం ఈజీఎస్ కింద రెండు, మూడునెలల కోసారి కూలీల ఖాతాలకు నేరుగా జమ చేస్తుంది. కూలీల వేతనాలకు 60 శాతం నిధులు విడుదల చేస్తుండగా, సామగ్రి ఖర్చుల కోసం 40 శాతం నిధులు విడుదల చేస్తుంది. వీటితో గ్రామాల్లో మురుగు కాలువలు, ఇంకుడుగుంతలు, సామూహిక, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, నూతన సీసీ రోడ్ల నిర్మాణం చేపడతారు.

**రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు (ఎస్ఎఫ్‌సీ)**

వీటిని పంచాయతీ జనాభా ప్రాతిపదికన ఇస్తారు. కొంతకాలంగా ప్రభుత్వం నుంచి విడుదల కావడం లేదు. వీటిని మల్టీపర్పస్ వర్కర్లకు వేతనాలతోపాటు విద్యుత్తు బిల్లులు, గ్రామంలో ఇతర చిన్నా చితక ఖర్చులకు వినియోగిస్తారు.

జనరల్ ఫండ్(గ్రామ పంచాయతీలు సొంతంగా సమకూర్చుకునే నిధులను జనరల్ ఫండ్(సాధారణ నిధులు)గా గుర్తిస్తారు. వీటిని పంచాయతీలో ప్రణాళిక రూపొందించుకొని సమావేశంలో తీర్మానంతో ఖర్చు చేయాల్సి ఉంటుంది.

స్థానిక పన్నులు గ్రామంలో ఇంటి నిర్మాణం అనుమతికి, ఇంటి పన్నులు, నల్లా బిల్లులు, ఆస్తి మార్పిడి, వారసంతలపై పన్నులతో గ్రామ పంచాయతీ ఖాతాకు నిధులు జమ అవుతాయి.

# నిబంధనలు తూచ్..!



బీబీనగర్ : జాతీయ రహదారి 163పై చేపడుతున్న వంతెన నిర్మాణ పనులు ప్రయాణికుల పాలిట శాపంగా మారాయి. హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారిపై బీబీనగర్ మండలం కొండమడుగుమెట్టు, ఎయిమ్స్ సమీపంలో తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో ఆయా కూడళ్లను బ్లాక్‌స్పాట్‌గా గుర్తించారు. ఇక్కడ వంతెనలు నిర్మిస్తే ప్రమాదాలు నివారించవచ్చని ప్రభుత్వానికి అధికారులు నివేదికలు పంపగా..

బీబీనగర్ మండలం కొండమడగుమె ట్టు కూడలి, రంగాపురం ఎయిమ్స్ ఆసుపత్రి ఎదురుగా వంతెనల నిర్మాణానికి నిధులు కేటాయించారు. టెండర్లు దక్కించుకున్న గుత్తేదారు ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటుచేయకుండానే పనులు ప్రారంభించడంతో వాహనదారులు ఇబ్బందులుపడుతున్నారు.

వరంగల్ - హైదరాబాద్ మార్గంలో కొండమడుగుమెట్టు సమీపంలో కనీస సూచిక బోర్డులు, రక్షణ వలయం ఏర్పాటు చేయలేదు. ఈ కారణంగా చోదకులు అయోమయానికి గురవుతున్నారు. ఒక్కసారిగా వాహనాలను నియంత్రించాల్సి రావడంతో ఆ వెనుకే వచ్చే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బీబీనగర్ బ్యాంకుల సమీపంలో సర్వీసు రోడ్డు ద్విచక్ర వాహనాలకు పార్కింగ్‌గా మారింది. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆ మార్గంలో ప్రయాణమంటేనే ప్రయాణికులు భయపడాల్సిన దుస్థితి నెలకొంది.

కేపాల్ నుంచి కొండమడుగుమెట్టు వచ్చే మార్గంలో కొండమడుగుమెట్టు మసీదు వద్ద ప్రధాన రహదారి నుంచి సర్వీసు రోడ్డు వైపు మళ్లే చోట కనీసం సూచిక బోర్డు ఏర్పాటుచేయలేదు. వరంగల్ - హైదరాబాద్ ప్రధాన మార్గం కావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

**తక్షణమే చేయాల్సింది...**

వంతెన నిర్మాణ పనులు జరిగే ప్రాంతాన్ని ముందే గుర్తించి ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటుచేయాలి.


వాహనాలు దారి మళ్లే చోటుకు 100 మీటర్ల ముందే సూచికలు, బారికేడ్లు ఏర్పాటుచేయాలి.

ప్రధాన రహదారి నుంచి సర్వీసు రోడ్డుకు మళ్లే చోట బ్లింకింగ్ లైట్లు లేవు. వీటిని తక్షణం ఏర్పాటు చేయాలి.

ట్రాఫిక్ సమస్య తలెత్తితే వెంటనే చర్యలు చేపట్టేందుకు ట్రాఫిక్ సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

అయా అంశాలపై జాతీయ రహదారుల ప్రాధికారిక సంస్థ వరంగల్ మేనేజర్ లింగయ్యను వివరణ కోరగా... జాతీయ రహదారి 163పై వంతెనల నిర్మాణ పనులు జరిగే సమయంలో వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నిబంధనలకు అనుగుణంగా గుత్తేదారు పనిచేసేలా చర్యలు చేపడుతున్నామని... నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

# నీళ్ల సీసా ఇవ్వరు..టీవీలు పెట్టరు



మిర్యాలగూడ : ప్రయాణికులకు సుఖవంతమైన ప్రయాణం అందించేందుకు ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సులను ప్రవేశపెట్టింది. పుష్ బ్యాక్ సీట్లతో పాటు టీవీ, తాగునీటి సౌకర్యం సైతం కల్పించే ఈ బస్సుల్లో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సుల కంటే అధిక ఛార్జీలు వసూలు చేస్తారు. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం సూపర్ లగ్జరీ బస్సులే ఉన్నత శ్రేణి బస్సులుగా ఉన్నాయి. మొత్తం ఏడు డిపోలకు మూడు డిపోల్లో సూపర్ లగ్జరీ బస్సులు ఉండగా.. మిర్యాలగూడ డిపోలో 13 విద్యుత్తు బస్సులతో కలిపి అత్యధికంగా 32 బస్సులు ఉన్నాయి. సూపర్ లగ్జరీ బస్సుల్లో రూ.10 అదనపు ఛార్జీ వసూలు చేస్తున్న యాజమాన్యం ఒక్కో ప్రయాణికుడికి అర లీటరు తాగునీటి సీసా అందిస్తున్నారు. పలు బస్సుల్లో డ్రైవర్లు ప్రయాణికులు అడిగితేనే నీళ్ల సీసాలు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

నీళ్ల సీసాలు ఉచితంగా అందిస్తారని తెలియక అనేక మంది ప్రయాణికులు బయట డబ్బులు పెట్టి కొనుగోలు చేస్తున్నారు. టిక్కెట్‌తో పాటే సీసా అందించకుండా మిగిలిన సీసాలను పలువురు డ్రైవర్లు హోటళ్లలో అమ్ముతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సూపర్ లగ్జరీ బస్సుల్లో టీవీలు ఉండగా పలు బస్సుల్లో ఈ టీవీలు పని చేయకపోగా...మరి కొన్ని వాటిల్లో డ్రైవర్లు టీవీలు ఆన్ చేయడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. అధిక ఛార్జీ చెల్లించి ప్రయాణిస్తున్న తమకు సౌకర్యాల్లో కోత విధిస్తుండటంతో నష్టపోతున్నామని పలువురు ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. సూపర్ లగ్జరీ బస్సుల్లో టీవీలు ఉండగా పలు బస్సుల్లో ఈ టీవీలు పని చేయకపోగా... మరి కొన్ని వాటిల్లో డ్రైవర్లు టీవీలు ఆన్ చేయడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. అధిక ఛార్జీ చెల్లించి ప్రయాణిస్తున్న తమకు సౌకర్యాల్లో కోత విధిస్తుండటంతో నష్టపోతున్నామని పలువురు ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. డ్రైవర్లకు ఆదేశాలిస్తాం... -కొణతం జాన్‌రెడ్డి, ఆర్టీసీ రీజినల్ మేనేజర్, నల్గొండ.

సూపర్ లగ్జరీ బస్సుల్లో టిక్కెట్‌తో పాటే ప్రయాణికులకు తాగునీటి సీసాలు అందించేలా డ్రైవర్లకు ఆదేశాలిస్తాం. బస్సుల్లో టీవీలు సక్రమంగా పని చేసేలా గుత్తేదారు సంస్థకు సూచనలు చేస్తాం. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సురక్షిత, సుఖవంతమైన ప్రయాణం అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

# ప్రభుత్వ వైద్య కళాశాలకు పీజీ కళ?

ఖమ్మం : వైద్యవిద్యతోపాటు వైద్యసేవల్లో నాణ్యతను పెంచే దిశగా ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాల కీలక ముందడుగు వేసింది. మూడేళ్ల క్రితం ప్రారంభమైన యూజీ కళాశాలలో తొలి ఎంబీబీఎస్ బ్యాచ్ తృతీయ సంవత్సరానికి చేరుకుంది. ఈ నేపథ్యంలో పీజీ కోర్సుల ప్రారంభానికి ప్రతిపాదనలు పంపించారు. కళాశాల ప్రిన్సిపల్, హెచ్ఓడీలు, ఇతర అధికార యంత్రాంగం ఈ ప్రక్రియను పూర్తి చేసి డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ), నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ)కు సమర్పించారు.

**ప్రతిపాదనలు ఇలా..**

కళాశాలలో ఐదు కీలక విభాగాల్లో ఒక్కో దానికి ఐదు సీట్ల చొప్పున మొత్తం 25 పీజీ కోర్సు సీట్లు మంజూరు చేయాలని ప్రతిపాదించారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, ఆర్థో, అనస్తీసియా విభాగాలకు సంబంధించి ఐదు సీట్ల చొప్పున కేటాయించాలని కోరారు. అధికారుల అంచనా ప్రకారం వచ్చే విద్యాసంవత్సరం నాటికి పీజీ కోర్సులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

**చేకూరే ప్రయోజనాలు..**

1.పీజీ కోర్సులతో సర్వజనాసుపత్రిలో పీజీలు(రెసిడెంట్లు) నిరంతరం అందుబాటులో ఉంటారు. అత్యవసర సేవలు, రాత్రివేళల్లో, సెలవు దినాల్లో కూడా నిపుణుల పర్యవేక్షణకు అవకాశం ఉంటుంది. కేసులు వేగంగా నిర్ధారణ కావటంతోపాటు చికిత్సల్లో నాణ్యత పెరుగుతుంది.

2.సంక్లిష్ట శస్త్రచికిత్సలు ఇక్కడే నిర్వహించటానికి వీలవుతుంది. బోధన,



పరిశోధన అభివృద్ధిపై కూడా దృష్టి సారించే అవకాశం లభిస్తుంది.

3.ఎంబీబీఎస్ విద్యార్థులకు క్లినికల్ ఎక్స్‌పోజర్, ప్రత్యక్ష బోధన లభించటంతో నైపుణ్యాలు మెరుగుపడతాయి.

4.పీజీ పూర్తి చేసిన వారు ఇక్కడే ఉంటూ కొంతకాలం సేవలందించాలి. స్పెషలిస్టుల కొరత తీరుతుంది.

5.ఉన్నత విద్య కోసం స్థానిక విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తప్పుతుంది. ఖమ్మం సర్వజనాసుపత్రి సంక్లిష్ట కేసులను స్వీకరించే సెంటర్‌గా రూపాంతరం చెందుతుంది.

'ఖమ్మం సర్వజనాసుపత్రిలో ఓపీ, ఐపీ మెరుగ్గా ఉంటుంది. మౌలిక వసతులు, మానవ వనరులు తగిన స్థాయిలో ఉన్నాయి. నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం అన్ని అంశాలతో ప్రతిపాదనలు పంపించాం. పీజీ సీట్ల రాకతో మరో కీలక మైలురాయికి చేరుకున్నట్టవుతుంది.' కళాశాల వైద్యాధికారులు.

# ఉచితం.. ఫలితం కచ్చితం

మంచిర్యాల : ప్రైవేటు ఆసుపత్రులబాట పట్టి రక్తపరీక్షలు చేసుకునేందుకు పేద, మధ్య తరగతి కుటుంబాలు వెనుకడుగు వేస్తున్నాయి. ఏ చిన్న పరీక్షకైనా ధరలు రూ.వందల్లో ఉండటంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. మూడు పదుల వయసుకు చేరారంటే ప్రతి ఒక్కరూ మూడు, ఆరు నెలలు, కనీసం ఏడాదికి ఒకసారైనా రక్తపరీక్షలు చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లోనే అధునాతన సేవలు అందుబాటులోకి వచ్చాయి. తెలంగాణ డయాగ్నోస్టిక్స్(టీ-హబ్)రాకతో రక్తపరీక్షలు ఉచితంగా అందుతున్నాయి. ప్రారంభంలో 50తో మొదలై ఇప్పుడు 72 రకాల పరీక్షలకు చేరి మెరుగైన సేవలు, నాణ్యతతో కూడిన ఫలితాలను అందిస్తోంది. అధునాతన యంత్రాలు, అనుభవజ్ఞులైన ల్యాబ్ టెక్నీషియన్ల సేవలతో రాష్ట్రంలోని 33 కేంద్రాల్లో మంచిర్యాల టీ-హబ్ ప్రతినెలా మొదటి ఐదు స్థానాల్లో నిలుస్తుండటం విశేషం.

**జిల్లాలో ఎక్కడ ఉన్నా..**

ప్రైవేటు ల్యాబ్‌లో రక్తపరీక్ష చేసుకోవాలంటే రూ.500-1000ఖర్చు చేయాల్సిందే. గ్రామీణులు జిల్లా కేంద్రానికి వచ్చి పరీక్షలు చేసుకోవాలంటే కష్టం. ఇప్పుడు జిల్లాలో ఎక్కడ ఉన్నా టీ-హబ్‌లో అందే 72 రకాల్లో ఏ పరీక్ష అయినా చేయించుకోవచ్చు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి.. ఇబ్బందిని తెలియజేసి..రక్త నమూనా అందిస్తే సరిపోతుంది. ఖరీదైన పరీక్షలు సైతం 12 గంటల్లో ఉచితంగా పొందొచ్చు. సీబీపీ నుంచి తలసీమియా, సికిల్‌సెల్, విటమిన్ బీ12, థైరాయిడ్, టీఆర్, ఏబీసీ వంటివి కూడా ఉచితం. వీటికి బయట రూ.500-రూ.2500వరకు ఉంటాయి.

**అపోహలు వీడండి**

టీ-హబ్‌లో అందుతున్న సేవలపై కొందరు ప్రైవేటు వైద్యులు, ల్యాబ్



నిర్వాహకులు అపోహలు సృష్టిస్తున్నట్లు తెలుస్తోంది. ఏ మాత్రం తేడా ఉండదని, వందశాతం నాణ్యమైనవి, నమ్మకమైనవంటూ ఈక్వాస్ ధ్రువీకరణ పత్రం అందించింది. జిల్లావాసులు చాలా వరకు ప్రభుత్వ ఆసుపత్రులబాట పడుతూ, రక్తపరీక్షలు సైతం అక్కడే చేసుకుంటుండటంతో బాధితులను కొంతమంది తప్పుదోవ పట్టిస్తున్నారు. అనుమానాలు, సందేహాలు అవసరంలేదని ఉచిత ఆరోగ్య సేవలను పొందాలని సంబంధిత కేంద్రం నిర్వాహకులు సూచిస్తున్నారు.

టీ-హబ్ సేవలు పొందుతున్న జిల్లాలోని ఆరోగ్య కేంద్రాల సంఖ్య: 33 (పీహెచ్‌సీ-18, యూపీహెచ్‌సీ-5, సీహెచ్‌సీ-1, ఏహెచ్-2, ఎంసీహెచ్-1, జీజీహెచ్-1, పీఎం జన్మన్-1, బీడీకే-4)

ఇప్పటి వరకు ఈ సేవలు అందుకున్న వారి సంఖ్య: 2,37,740

స్వీకరించిన రక్తనమూనాలు: 4,44,403

పరీక్షలు: 7,68,967

మొత్తం వ్యాధి నిర్ధారణ పరీక్షలు: 40,89,939.

# మత్తు తలకెక్కి.. వేగం రోడ్డెక్కి

హైదరాబాద్ : "ఇంజినీరింగ్ పూర్తయింది.. ఉద్యోగ వేటలో ఉన్నాడు. అమీర్‌పేట్‌లోని ఒక శిక్షణ సంస్థలో ఐటీ కోర్సు చేస్తున్నాడు. వారాంతం దోస్తులతో కలిసి శివారు ఫామ్‌హౌస్‌లో పార్టీ చేసుకున్నాడు. నగరంలోని రూమ్‌కు బైక్‌పై వేగంగా వెళ్తూ ప్రమాదానికి గురయ్యాడు. కొడుకును బతికించుకునేందుకు తల్లిదండ్రులు ఊళ్లోని పొలం అమ్మారు. వారి ఆవేదనను నగర ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ ఇటీవల పంచుకున్నారు. 6 శాతం పెరిగాయి.. నగరంలో ఏటా 3వేల రోడ్డు ప్రమాదాలు నమోదవుతున్నాయి. వాటిలో 300 మంది మృత్యువాత పడుతున్నారు. అధికశాతం ప్రమాదాలకు అతివేగం, మద్యం మత్తులో వాహనం నడపటమే కారణమంటున్నారు పోలీసులు. పోలీసుల తనిఖీలు, చలానాలు, న్యాయస్థానాల శిక్షలు విధిస్తున్నా నిబంధనలు పాటించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. కొందరు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకుంటున్నారు. గతేడాదితో పోల్చితే 10 నెలల వ్యవధిలో 6 శాతం ప్రమాదాలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. దీనికి అడ్డుకట్ట వేయాలని ఉద్దేశంతో సీపీ సజ్జనార్ ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు. పగలు,



రాత్రి వేళల్లో డ్రంకెన్‌డ్రైవ్ చేపట్టనున్నారు. కేసు తీవ్రతను బట్టి వాహనాలను సీజ్ చేస్తామని సీపీ స్పష్టంచేశారు.

**మాకేం కాదు.. బండి మస్త్ నడుపుతం**

మద్యం కొద్దిగానే తాగాం.. బండి నడపటంలో ప్రావీణ్యం ఉంది. మేం వెళ్లేదారిలో పోలీసులు తనిఖీలు ఉండవనే ధీమాతో మత్తులో వాహనం నడిపే వారే అధికం. తనిఖీ సమయంలో పోలీసులతో కొందరు మందుబాబులు వాదనకు దిగుతారు. రోజూ 140-150 మంది డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడతారు. వీరిలో 90శాతం మంది ద్విచక్రవాహనదారులే ఉంటున్నారు. జైలు శిక్ష పడ్డ ఉద్యోగులను కొన్ని సంస్థలు తొలగిస్తున్నాయి. ఈ ఏడాది సుమారు 30 మంది కొలువులు కోల్పోయినట్టు పోలీసు అధికారి తెలిపారు. ఈ ఏడాది 10 నెలల వ్యవధిలో 42,628 కేసుల్లో రూ.8,79,45,100 న్యాయ స్థానం జరిమానా విధించింది.

# ఏటీ'ఎస్' అనేదెప్పుడో..?

హైదరాబాద్ : ఆధునిక యుగంలోనూ సాంకేతికతను అందిపుచ్చుకో వడంలో రవాణాశాఖ నిర్లక్ష్యం చూపుతోంది. వాహన సామర్థ్య ధ్రువీకరణ పరీక్షలు చేయడానికి అనేక రాష్ట్రాల్లో ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లు (ఏటీఎస్) ఏర్పాటు చేసి మానవ ప్రమేయం లేకుండా చేస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 4 స్టేషన్లతో సహా రాష్ట్రవ్యాప్తంగా 37 ఏటీఎస్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించినా వాటి అధికార యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తోంది. ప్రతిపాదనలు



దాటి వాటి ఏర్పాటు ప్రక్రియ ముందుకు సాగడం లేదు. అత్యాధునిక సాంకేతికత అందుబాటులో ఉన్నా ఇంకా మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ)ల ద్వారానే పరీక్షలు చేస్తున్నారు. మ్యాన్యువల్‌గా చేయడం వల్ల కొందరు అధికారులు అమ్యామ్యాలు పుచ్చుకుని తనిఖీలు సరిగ్గా చేయడం చేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా ప్రమాదాలు జరిగి ప్రయాణికులు మరణిస్తున్నారు.

**ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం..**

ఇటీవల జరిగిన ఘోర రోడ్డు ప్రమాదాల్లో రవాణా శాఖ నిర్లక్ష్యం బయటపడింది. ఏటీఎస్‌ల ద్వారా తనిఖీలు నిర్వహిస్తే ఫిట్‌నెస్ విషయంలో పొరపాట్లకు ఆస్కారం ఉండదు. వాహనంలో చిన్న లోపం ఉన్నా వెంటనే తెలిసిపోతుంది. ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా మొత్తం రూ.300 కోట్లతో ఏటీఎస్‌ల ఏర్పాటుకు పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. అనుమతులు వచ్చిన వెంటనే మొదటి దశలో 15 కేంద్రాలను ఏర్పాటు చేయడానికి పనులు మొదలుపెట్టినట్లు అధికారులు చెబుతున్నా ఎక్కడా కార్యరూపం దాల్చలేదు. వాటి ఏర్పాటులో అధికార యంత్రాంగం ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం చేస్తోం దనే ఆరోపణలు ఉన్నాయి. "ఏటీఎస్‌ల ఏర్పాటుకు ఒక్కో కేంద్రానికి సుమారు ఎకరా స్థలం అవసరం. ప్రస్తుతం భూమి ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. అనువైన స్థలం దొరకగానే పనులు మొదలుపెడతాం" అని ఓ ఆర్టీఏ అధికారి వెల్లడించారు.

# కొండెక్కిన కోడిగుడ్డు!

సూర్యాపేట : కోడి గుడ్డు ధరలు ఒక్కసారిగా పెరిగిపో యాయి. గత నెలలో రూ.5 నుంచి రూ.6 విక్రయించగా.. ప్రస్తుతం రూ.7 నుంచి రూ.8 వరకు అమ్ముతున్నారు. వినియోగదారులు కొనేందుకు ఆలోచి స్తున్నారు. ఓ వైపు కూరగాయల ధరలు మండుతుండగా.. ఇప్పుడు కోడిగుడ్డు ధరతో సామాన్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డిమాండ్‌కు తగ్గట్టు సరఫరా లేకపోవడమే ధర పెరుగుదలకు కారణ మని వ్యాపారులు చెబుతున్నారు. అదేవిధంగా అక్టోబరులో కిలో చికెన్ రూ.240 నుంచి రూ.260 పలకగా, ప్రస్తుతం రూ.20 నుంచి రూ.4 వరకు తగ్గింది. మాంసం ధరలు తగ్గినా గుడ్డురేటు పెరగడం గమనార్హం.

# లేనిది ఉన్నట్టు.. అంతస్తుకో రేటు



హైదరాబాద్ : అడిగినంత ఇస్తే.. ఎలాంటి భవనానికైనా ఇంటి నంబర్లు ఇస్తామంటూ పలువురు జీహెచ్ఎంసీ అధికారులు వసూళ్లకు తెగబడుతున్నారు. బహుళ అంతస్తులకైతే.. అంతస్తుకింత చొప్పున వసూళ్లు చేస్తున్నారు. లేని ఇళ్లకు ఇంటి నంబర్లు జారీ చేసిన అల్వాల్ సర్కిల్ అవినీతి బాగోతాన్ని మరవక ముందే.. చందానగర్ సర్కిల్ అధికారుల లీలలు వెలుగులోకి వచ్చాయి. ఖానామెట్, ఇజ్జత్‌నగర్, అయ్యప్పసొసైటీ భూముల్లో కట్టే వివాదాస్పద, అనుమతిలేని భవనాలకు ఇంటి నంబర్లు జారీ చేస్తున్నారు.

**ఇళ్లు లేకున్నా నంబర్లు ఇస్తారు..**

చందానగర్ సర్కిల్ పరిధిలో వివాదాస్పద భూములు వెయ్యి ఎకరాలకుపైగా ఉన్నాయి. వాటిలో ఇళ్ల స్థలాలు కొని, ఇల్లు కట్టుకోలేని స్థితిలో ఉన్న వారిని పలువురు బిల్డర్లు, నేతలు,అధికారులు లక్ష్యంగా చేసుకుంటున్నారు. తక్కువ ధరకు భూములు కొనేసి.. అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. వాటికి ఇంటి నంబర్లు తీసుకోవ డం, మరొకరికి రిజిస్ట్రేషన్ చేయడం ఆనవాయితీగా మారింది. ఈ దందాకు జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు, రెవెన్యూ విభాగం అండగా నిలుస్తున్నాయి. అక్రమ నిర్మాణాలకు టౌన్‌ప్లానింగ్ అధికారులు కొమ్ముకాస్తుంటే.. రెవెన్యూ విభాగంలోని ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, డీసీలు ఇంటి నంబర్లు ఇస్తున్నారు.

పార్కు స్థలాలు, లేఅవుట్ ఖాళీ స్థలాలను ఆక్రమించే వారితోనూ అవినీతి అధికారులు చేతులు కలుపుతున్నారు. గతేడాది చందానగర్ సర్కిల్‌లోని మదీనాగూడ శాంతినగర్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలోని రెండు ఖాళీ స్థలాలకు అప్పటి ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి ఇంటి నంబర్లు జారీ చేయడమే అందుకు నిదర్శనం.

అక్రమ సంపాదన ఈ స్థాయిలో ఉన్నందునే.. శేరిలింగంపల్లి, చందానగర్ సర్కిళ్ల రెవెన్యూ విభాగంలో ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్‌కలెక్టర్లుగా పనిచేసేందుకు పోటీపడుతుంటారు. ప్రభుత్వ వివాదాస్పద భూముల సమస్యను పరిష్కరిస్తే.. ప్రజలకు ఈ సమస్యలుండవని స్థానికులు సర్కారును కోరుతున్నారు.

**రూ.60 లక్షలకు..**

ఖానామెట్ లోని 11బై27 సర్వే నంబరులోని వెయ్యి గజాల్లో ఐదంతస్తుల భవనం కట్టారు. సదరు సర్వే నంబరుపై న్యాయస్థానంలో వాజ్యం నడుస్తోంది. అయినా సరే ఆ భవనానికి ఏప్రిల్ 1, 2024న 1219997816, 1219997817, 1219997818, 1219997819, 1219997820 పీటీఐఎన్ నంబర్లతో పది ఇంటి నంబర్లు ఇచ్చారు. అందుకు రూ.60లక్షలు ముట్టినట్లు చెబుతున్నారు. పై స్థాయిలో ఒత్తిడి వల్లే ఇచ్చామని ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ దేవేందర్ తెలిపారు.

# మీరు జీవించే ఉన్నారు..



హైదరాబాద్: విశ్రాంత ఆచార్యులకు నెలనెలా సులువుగా పింఛన్ సొమ్ము వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేందుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం అధికారులు 'డిజిటల్ ఎగ్జిస్టెన్సీ' ధ్రువపత్రాన్ని ఇస్తున్నారు. డిజిటల్ పత్రం ఇవ్వకముందు పదవీ విరమణ చేసిన ఆచార్యులు, బోధనేతర సిబ్బందికి పింఛన్ డబ్బు ఇవ్వాలంటే 'లైఫ్ సర్టిఫికెట్'ను బ్యాంకు అధికారులకు సమర్పించాలి. వైద్యులు, రెవెన్యూ అధికారులు లైఫ్ సర్టిఫికెట్‌ను జారీచేస్తే.. ఓయూ ధ్రువీకరించేది. ఇంత ప్రయాస అవసరం లేకుండా 3 వేల మంది పింఛన్‌దారులకు అధికారులు డిజిటల్ ధ్రువపత్రాలు ఇస్తున్నారు. 'జీవన్ ప్రమాణ్ పోర్టల్'కు అనుసంధానమవ్వడం వల్ల ఇదంతా సాధ్యమయ్యిందని ఓయూ ఉపకులపతి ప్రొఫెసర్ కుమార్ మొలుగరం వివరించారు.

**డౌన్‌లోడ్ చేసుకోండిలా..**దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల్లో పదవీవిరమణ చేసిన ఉద్యోగులకు జీవన్ ప్రమాణ్ పోర్టల్‌ను కేంద్రం ఇటీవలే అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈనెల 1 నుంచి డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లను ఈ పోర్టల్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపింది. జీవన్ ప్రమాణ్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి పింఛన్‌దారులు వారి వ్యక్తిగత వివరాలు, పింఛన్ నంబరు, ఆధార్, చిరునామా, సెల్ఫీ అప్‌లోడ్ చేస్తే చాలు. గంటల వ్యవధిలో డిజిటల్ ధ్రువపత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.**తపాలా సిబ్బంది సాయంతోనూ..**

జీవన్ ప్రమాణ్ పోర్టల్ గురించి తెలిసినా.. వివరాలు నమోదు చేసుకోలేని పింఛన్‌దారులు సమీపంలోని మీ-సేవాకేంద్రాలకు వెళ్లి తమ వివరాలను నమోదు చేసుకోవచ్చు. అక్కడికి వెళ్లలేని వారు తమ ఇంటికి వచ్చే తపాలాశాఖ సిబ్బందిని కూడా కోరవచ్చు. వివరాలు నమోదు చేసుకున్నాక పింఛన్‌దారుడి ఫొటో అప్‌లోడ్ చేస్తే సరిపోతుంది. నవంబరు 30వరకూ డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ పొందేదుకు గడువు ఉంది.

# సాధికారత.. భద్రత

సిరిసిల్ల : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న బాలికల్లో ఆత్మస్థైర్యాన్ని నింపి సమయం వచ్చినప్పుడు సమస్యను ఎదుర్కొనే దిశగా తోడ్పాటును అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. బాలికలు పాఠశాలకు వచ్చే సమయంలో లేదా ఇతర సమయాల్లో ఈవ్‌టీజింగ్, అవమానం, లైంగిక వేధింపులు వంటివాటిని ఎదుర్కొనేలా బాలికల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించే దిశగా ప్రభుత్వ పాఠశాలలతో పాటు కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో బాలికా సాధికారత కౌమార భద్రతా క్లబ్‌లు ఏర్పాటు చేశారు.

**ఉమ్మడి జిల్లాలో 928 పాఠశాలల్లో..** ఉమ్మడి జిల్లాలోని పాఠశాలల్లో 928 బాలికా సాధికారత కౌమార భద్రతా క్లబ్‌లను ఏర్పాటు చేశారు. ప్రతి పాఠశాలలో 14 నుంచి 16 మందితో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. 6 నుంచి 'పది' వరకు ఒక్కో తరగతి నుంచి ఇద్దరు క్రియాశీలక బాలికలను లీడర్లుగా ఎంపిక చేశారు. కమిటీకి ఛైర్మన్‌గా ప్రధానోపాధ్యాయుడు, సభ్యులుగా బాలికలతో స్నేహపూర్వకంగా ఉ ండే మహిళా టీచర్ లేదా ఒక సీనియర్ ఉపాధ్యాయుడు ఉన్నారు. బాలికలు వారి సమస్యలను సంబంధిత క్లబ్ సభ్యుల ద్వారా ప్రధానోపాధ్యాయుడికి తెలిపితే సంబంధిత శాఖల ద్వారా విద్యార్థుల సమస్యను పరిష్కరించనున్నారు.

సంబంధించిన పుస్తకాలను కూడా పాఠశాలలకు అందజేశారు. వివిధ శాఖల సమన్వయంతో విద్యార్థులకు షెడ్యూల్ ప్రకారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వీటిపై టీశాట్‌లో ప్రసారం కానున్న తరగతులను విద్యార్థులకు చూపెట్టనున్నారు. క్లబ్ ఏర్పాటు చేసిన పాఠశాలలో గ్రీవెన్స్ బాక్స్ ఏర్పాటు చేశారు. నేరుగా సమస్యను తెలియజేయని విద్యార్థుల కోసం ఈ బాక్స్‌ను ఏర్పాటు చేశారు. తను ఎదుర్కొన్న సమస్యను కాగితంపై రాసి బాక్స్‌లో వేస్తే పరిష్కారానికి కృషి జరుగుతుంది.

అవగాహన కల్పించే విషయాలు
కౌమార దశలో వచ్చే మార్పులు
బాలికల సంరక్షణ
బాలికలపై వేధింపులు



ఆరోగ్య సంరక్షణ
న్యాయ సంరక్షణ విధానాలు
బాల్య వివాహాలు
మాదక ద్రవ్యాలు
సైబర్ నేరాలు
పొదుపుజి
బాలికల ఆత్మరక్షణ
జీవన నైపుణ్యాలు
మానసిక పరమైన కౌన్సెలింగ్
కెరీర్ గైడెన్స్.

ఆత్మస్థైర్యం పెంపు: పద్మజ, లింగ సమానత్వ సమన్వయకర్త

బాలికల్లో ఆత్మస్థైర్యాన్ని నింపడానికి, వారిపై అకృత్యాలను అరికట్టడానికి బాలిక సాధికారత క్లబ్బులు ఉపయోగపడతాయి. పాఠశాలల్లో గ్రీవెన్స్ బాక్సులు ఉంటాయి. వాటిని ప్రతి శుక్రవారం క్లబ్‌ల ఆధ్వర్యంలో తెరిచి సమస్యలను పరిష్కరించనున్నాం.

# కాల్వ చివరలు కబ్జా

గుర్రంపోడు : ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కాల్వల అంచులు ఆక్రమణలతో కుచించుకుపోతున్నాయి. ఎగువన ఉన్న రైతులు కాల్వలను పూడ్చి తమ పంట భూముల్లో కలుపుకొంటు న్నారు. పట్టించుకునేవారు లేక రెండు మూడు కిలోమీటర్ల పొడవునా ఉనికి కోల్పోయాయి. రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు. దీంతో పోరాడిన రైతులూ రాజీ పడిపోతున్నారు. ఏఎమ్మార్పీలోని ప్రతి మైనరు కాల్వలోనూ ఇదే పరిస్థితి నెలకొనటం అధికారులను సైతం విస్తుగొలుపుతున్నాయి.

**నీరు రాకపోవటం వల్లే..**

ఏఎమ్మార్ ప్రాజెక్టు ప్రధాన కాల్వకు 55 ప్రధాన డిస్ట్రిబ్యూటర్లు ఉ ండగా ప్రతి డిస్ట్రిబ్యూటరీకి రెండు వైపులా పది నుంచి 20పైగా మైనరు కాల్వలున్నాయి. ప్రాజెక్టు మొత్తం మీద 450 పైగా మైనర్లు ఉన్నట్లు అంచనా. కేవలం కాల్వలు తవ్వి రైతులకు అప్పగించారు. ఎప్పుడు నీళ్లు వదిలినా ఈ మైనరు కాల్వలకు చివరి వరకూ నీరు రాకపోవటంతో అవి క్రమంగా నేలమట్టం అయ్యాయి. దీంతో వాటిని సమీప రైతులు తమ పంట భూముల్లో కలుపుకొంటున్నారు. రెండు మూడేళ్ల పాటు అధికారుల చుట్టూ తిరిగి ఫిర్యాదు చేసినా ప్రయోజనం



కనిపించక వదిలేస్తున్నారు. ముక్కాముల నుంచి కొత్తలూరు మధ్యన డి-22 మేజరు కాల్వ ముగుస్తుంది. చివరన ఒక కిలో మీటరు వరకు కాల్వలను పక్కరైతులు ఆక్రమించటంతో దిగువ రైతులు అధికారులకు ఫిర్యాదు చేసినా రాజకీయ నాయకుల ప్రమేయంతో ఆక్రమణలను వదిలించలేకపోయారు. డి-20లో 4ఆర్ కూడా చివరి కాల్వలు ఆక్రమించిన విషయంపై ఫిర్యాదు అందుకున్న అధికారులు కాల్వలు పరిశీలించి విస్తుపోయారు.

**చర్యలు తీసుకుంటాం-పరమేశ్, డీఈఈ, నీటిపారుదలశాఖ**

ప్రభుత్వం డిజైన్ చేసి తవ్విన ప్రతి కాల్వను పరిశీలిస్తాం. ఎక్కడైనా ఆక్రమించినట్లు తేలితే సదరు రైతులపైనా క్రిమినల్ చర్యలు తీసుకుం టాం. కాల్వల కబ్జాతో తోటి రైతులే ఇబ్బంది పడతారని గుర్తించాలి.

# ఆకర్షణీయ ప్రకటనలు.. 'సైబర్' మోసాలు

ఖమ్మం :తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయంటూ ఆకర్షించి మోసం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ప్రజలకు సూచించారు. సైబర్ మోసగాళు నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్ యాప్‌లు, వెబ్‌సైట్లు రూపొందించి మోసాలకు పాల్పడుతున్నారని అన్నారు. కొత్త సంస్థ, ప్రసిద్ధ సంస్థ పేరుతో ఐపీఓ(ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్) వస్తుందని తక్కువ ధరకే షేర్లు వస్తున్నాయని సామాజిక మాధ్యమాల్లో లింకులు పంపుతూ మోసం చేశారని పలు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు.


మోసాలు ఇలా..

మోసగాళ్లు పెద్ద కంపెనీ ఐపీఓ వచ్చిందని నమ్మదగిన ప్రకటనలు, నకిలీ వెబ్‌సైట్‌లు సృష్టిస్తున్నారని అన్నారు. ఆ లింక్ లేదా ఫారమ్ ద్వారా బ్యాంక్ ఖాతా వివరాలు, ఆధార్, పాన్, యూపీఐ ద్వారా చెల్లింపులు చేయమని చెప్పి మోసం చేస్తున్నారని అన్నారు. డబ్బు బదిలీ చేసిన తదుపరి మోసగాళ్లు వెబ్‌సైట్ మూసేసి మాయం అవుతారు. నకిలీ షేర్ సర్టిఫికెట్లు, రసీదులు కూడా పంపి మోసం చేస్తారని పేర్కొన్నారు.

జాగ్రత్తలుజి

ఐపీఓ పెట్టుబడి పెట్టే ముందు సెబీ, ఎన్‌ఎస్‌ఈ, బీఎస్‌ఈ అధికారిక వెబ్‌సైట్‌లో సదరు కంపెనీ నిజంగా ఐపీఓ నమోదు అయిందో లేదో ధ్రువీకరించుకోవాలి. సోషల్ మీడియా, వ్యక్తిగత సందేశాల ద్వారా వచ్చే ఐపీఓ ఆఫర్లను నమ్మి మోసపోవద్దన్నారు. ఎవరైనా ముందుగా 'అడ్వాన్స్ పేమెంట్', రిజిస్ట్రేషన్ ఫీజు అడిగితే డబ్బు బదిలీ చేయొద్దన్నారు.

ట్రేడింగ్ యాప్, వెబ్‌సైట్ సెబీ,ఆర్‌బీఐ వద్ద రిజిస్టర్ అయిందా లేదా అని తప్పని సరిగా చెక్ చేయాలి. గ్యారెంటీడ్ రిటన్స్, డబుల్ మనీ అని చెప్పే వారిని నమ్మకండి. సోషల్ మీడియా ద్వారా వచ్చే నకిలీ యాప్, వెబ్‌సైట్‌లను ఉపయోగించవద్దు. ఎవరైనా వీడియో కాల్, వాట్సప్ ద్వారా పెట్టుబడి పెట్టమని ఒత్తిడి చేస్తే వెంటనే కాల్ కట్



చేసి ఫిర్యాదు చేయాలని సీపీ సూచించారు.

నకిలీ ట్రేడింగ్‌తో..

తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని సామాజిక మాధ్యమాలు, యూట్యూబ్ వీడియోలు, వాట్సప్ గ్రూపులు, టెలిగ్రామ్ ఛానళ్ల ద్వారా ప్రకటనలు చేస్తారన్నారు. 'రోజుకు వేలల్లో లాభం', 100% రిటర్న్ అంటూ ప్రకటనలు చేసి మోసాలకు పాల్పడుతున్నారని అన్నారు. మొదట యాప్, వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేయమని చెబుతారు. చిన్న మొత్తంలో పెట్టుబడి పెట్టగానే కొంత లాభం చూపించి నమ్మకం కలిగించి తరువాత మోసాలకు పాల్పడుతారు. ఆ తదుపరి పెద్ద పెట్టుబడి పెట్టమని ప్రోత్సహిస్తారు. తరువాత విత్‌డ్రా చేయాలంటే ట్యాక్స్, సర్వీస్ ఛార్జి పేరుతో డబ్బు అడిగి మోసం చేస్తారన్నారు. చివరకు వెబ్‌సైట్, యాప్ యాక్సెస్ నిలిపివేసి, డబ్బుతో మాయమ వుతారని పేర్కొన్నారు.




## మంత్రులు ఇలా చేస్తే సహించేది లేదు.. సీఎం చంద్రబాబు స్ట్రాంగ్ వార్నింగ్

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఏపీ మంత్రి మండలి సమావేశం ఇవాళ(గురువారం) జరిగింది. ఈరోజు ఉదయం 10:30కు కేబినెట్ భేటీ ఏపీ సచివాలయంలో ప్రారంభమైంది. మొత్తం 44 అంశాలపై మంత్రి మండలి సమావేశంలో ముఖ్యమంత్రి చర్చించారు. **మంత్రులు క్రమశిక్షణ పాటించాలి..** అయితే, కేబినెట్ సమావేశానికి ఆలస్యంగా వచ్చిన నలుగురు మంత్రులపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. మంత్రివర్గ సమావేశానికి ఆలస్యంగా వస్తే ఎలా అని ప్రశ్నించారు. కనీసం సరైన క్రమశిక్షణ పాటించాలి కదా అని మందలించారు. మంత్రి మండలి సమావేశం ఈరోజు ఉదయం 10:30 గంటలకు అని ముందే తెలుసు కదా అని నిలదీశారు. ఈ సమావేశానికి తగ్గినట్లుగా మంత్రులు ఎందుకు ప్లాన్ చేసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ సారి నుంచి కేబినెట్ భేటీకి ఆలస్యంగా వస్తే సహించేది లేదని మంత్రులకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు సీఎం చంద్రబాబు.

**టీడీపీ కార్యాలయానికి సీఎం చంద్రబాబు...** కాగా, కేబినెట్ సమావేశం అనంతరం అమరావతిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయానికి వెళ్ళారు సీఎం చంద్రబాబు. పార్టీ సెంట్రల్ ఆఫీస్‌లో ఈ రోజు(గురువారం) పార్టీ నేతలతో సీఎం భేటీ అయ్యారు. మండల పార్టీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షులు నియామకంపై త్రిసభ్య కమిటీ వేశారు సీఎం చంద్రబాబు.

**త్రిసభ్య కమిటీపై చర్చ..** ఇటీవల త్రిసభ్య కమిటీపై సీఎం అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. మళ్లీ తాజాగా త్రిసభ్య కమిటీలను పార్టీ కేంద్ర కార్యాలయానికి పిలిపించి మాట్లాడారు జిల్లా పార్టీ అధ్యక్షుడు, జిల్లా కమిటీల నియామకంపై ఈ రోజు త్రిసభ్య కమిటీలతో చర్చించారు. అనంతరం టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధులతో కూడా సమావేశం అయ్యారు సీఎం చంద్రబాబు.




## ఏపీ కేబినెట్.. రూ.9,500 కోట్ల ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్

అమరావతి, డిసెంబర్ 11: ఏపీ మంత్రివర్గ సమావేశం ముగిసింది. ఈరోజు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి.. నిర్ణయం తీసుకున్నారు. దాదాపు 44 అజెండా అంశాలతో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. రూ.9,500 కోట్లతో 506 ప్రాజెక్టులకు పరిపాలన అనుమతులకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలో సమగ్ర నీటి నిర్వహణకు సంబంధించిన ప్రాజెక్టులు, అమరావతిలో లోక్‌భవన్, అసెంబ్లీ దర్బార్ హాల్ నిర్మాణానికి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అదే విధంగా గవర్నర్ కార్యాలయం, గెస్ట్ హౌస్‌లు, స్టాఫ్ క్వార్టర్ల నిర్మాణానికి మంత్రివర్గ సమావేశంలో చర్చించి అంగీకారం తెలిపారు. అలాగే పలు సంస్థలకు భూ కేటాయింపులకు కేబినెట్ అనుమతి ఇచ్చింది.

**కీలక నిర్ణయాలు ఇవే..** సీడ్ యాక్సెస్ రహదారిని 16వ హైవేకి అనుసంధాన పనులకు రూ.532 కోట్లకు కేబినెట్ ఆమోదం. కుప్పంలో పాలేరు నదిపై చెక్‌డ్యామ్‌ల నిర్వహణకు పరిపాలన అనుమతుల మంజూరుకు ఓకే. గిరిజన సంక్షేమశాఖలో 417 భాషా పండితుల పోస్టులను స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతికి గ్రీన్ సిగ్నల్. ఆంధ్రప్రదేశ్ ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ ముసాయిదా బిల్లుపై కేబినెట్‌లో చర్చ, ఆమోదం. ఎస్ఐపీబీలో తీసుకున్న పలు కీలక నిర్ణయాలకు ఆమోదం. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశ నిర్ణయాలకు ఆమోదం. రూ.20 వేల కోట్ల పెట్టుబడులకు సంబంధించి 26 సంస్థలకు ఏపీ కేబినెట్ ఆమోదం.




కళ్యాణదుర్గం: అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మున్సిపాలిటీని తెదేపా కైవసం చేసుకుంది. ఉత్కంఠ పరిణామాల మధ్య మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా తలారి గౌతమి ఎన్నికయ్యారు. గురువారం ఉదయం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎన్నిక నిర్వహించారు. మొత్తం 24 మంది కౌన్సిలర్లు ఉండగా.. వైకాపా నుంచి 11 మంది, తెదేపా నుంచి 11 మంది హాజరయ్యారు. ఈ నేపథ్యంలో ఎక్స్‌అఫీషియో సభ్యులు కీలకంగా మారారు. ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఉన్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే సురేంద్రబాబు గౌతమికి మద్దతు ఇచ్చారు. దీంతో 13 మంది మద్దతుతో ఆమె ఛైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు.

**మాచవరం ఎంపీపీ పదవినీ..** మరోవైపు పల్నాడు జిల్లా మాచవరం ఎంపీపీ పదవిని తెదేపా కైవసం చేసుకుంది. ఎంపీపీగా పిల్లుట్ల గ్రామానికి చెందిన ఎంపీటీసీ కొక్కెర అంజమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో మొత్తం 15 మంది ఎంపీటీసీ సభ్యులు గెలుపొందగా.. ఒకరు చనిపోయారు.

మిగిలిన 14 మందిలో 11 మంది నేటి సమావేశానికి హాజరయ్యారు. వీరిలో ఆరుగురు తెదేపా అభ్యర్థికి మద్దతు ఇవ్వడంతో ఎంపీపీగా అంజమ్మ ఎన్నికయ్యారు.

## కడప మేయర్‌గా పాక సురేశ్ ఎన్నిక

కడప, డిసెంబరు11: కడప కార్పొరేషన్ మేయర్ ఎన్నిక ఇవాళ(గురువారం) జరిగింది. ఈ ఎన్నికల్లో కడప మేయర్‌గా పాక సురేశ్ ఎన్నికయ్యారు. కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన ఎన్నిక ప్రక్రియలో పాక సురేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు వైసీపీ కార్పొరేటర్లు. జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ పర్యవేక్షణలో ఎన్నిక ప్రక్రియ జరిగింది. మేయర్ అభ్యర్థిగా పాక సురేశ్ అభ్యర్థిత్వాన్ని వైసీపీ కార్పొరేటర్లు, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, షఫీలు బలపరిచారు. దీంతో పాక సురేశ్ ఏకగ్రీవంగా మేయర్‌గా ఎన్నికైనట్లు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ ప్రకటించారు. అయితే, వైసీపీ పాలక వర్గంలోనే మేయర్ పదవి కోసం ముగ్గురు కార్పొరేటర్లు పోటీపడ్డారు. పోటీలో ఉన్న ముగ్గురిలో ఒకరిని ఎంపిక చేసేందుకు రంగంలోకి ఎంపీ అవినాశ్ రెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డిలు దిగారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పోటీలో ఉన్న 47వ డివిజన్ కార్పొరేటర్ పాక సురేశ్‌ను మేయర్‌గా ఎంపిక చేశారు. ఈ ఎన్నికలో పాక సురేశ్‌ను అధికారికంగా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ ప్రకటించారు. స్థానిక ఎన్నికలు, మేయర్ పదవీకాలం మూడు నెలలు గడువు మాత్రమే ఉండటంతో తెలుగుదేశం పార్టీ పోటీకి దూరంగా ఉన్న విషయం తెలిసిందే. గత కడప నగర మేయర్ సురేశ్ బాబు అవినీతి, అక్రమాలు వాస్తవమని తేలడంతో మేయర్ పదవిని తొలగించింది కూటమి ప్రభుత్వం. కాగా, కడప నగరమేయర్ ఎన్నిక సందర్భంగా ఎన్నికల అధికారి జేసీ అతిథి సింగ్‌కు వైసీపీ అభ్యర్థి బీఫామ్, ఏ ఫాం, విప్ నోటీసు కాపీలను వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా



రవీంద్రనాథ్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. అందరూ కార్పొరేటర్ల ఏకాభిప్రాయంతోనే మేయర్ అభ్యర్థిని ఖరారు చేశామని తెలిపారు. ఎవరూ అసంతృప్తికి లోను కాలేదని చెప్పుకొచ్చారు. వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్నవారే కార్పొరేటర్లుగా ఉన్నారని స్పష్టం చేశారు.

**ముద్దనూరు ఎంపీపీగా వెన్నపూస పుష్పాలత ఎన్నిక..** మరోవైపు... ముద్దనూరు ఎంపీపీ ఎన్నిక ఇవాళ(గురువారం) జరిగింది. వైసీపీ ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డితో కలసి ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకున్నారు వైసీపీ ఎంపీటీసీలు. ఎంపీపీ ఎన్నికకు కూటమి పార్టీలైన తెలుగుదేశం, బీజేపీ, జనసేన దూరంగా ఉన్న విషయం తెలిసిందే. వైసీపీకి చెందిన వెన్నపూస పుష్పాలతను ఎంపీపీగా జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ ఎంపిక చేశారు. ముద్దనూరు ఎంపీపీ ఎన్నిక సందర్భంగా కడప జిల్లా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.




పల్నాడు జిల్లా, డిసెంబర్ 11: మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అతడి సోదరుడు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి మాచర్ల కోర్టులో లొంగిపోయారు. వెల్దుర్తి మండలం గుండ్లపాడు జంట హత్యల కేసులో A6 పిన్నెల్లి రామకృష్ణారెడ్డి , A7 పిన్నెల్లి వెంకటరామిరెడ్డి నిందితులుగా ఉన్న విషయం తెలిసిందే.

ఈ కేసుకు సంబంధించి రెండు వారాల్లో లొంగిపోవాలంటూ పిన్నెల్లి సోదరులకు సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. నేటితో సుప్రీం కోర్టు గడువు ముగియడంతో ఈరోజు (గురువారం) ఉదయం మాచర్ల జూనియర్ సివిల్ కోర్టులో పిన్నెల్లి సోదరులు లొంగిపోయారు. ఈ ఏడాది మే 24న పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన అన్నదమ్ములు జవిశెట్టి వెంకటేశ్వర్లు, జవిశెట్టి కోటేశ్వరరావులు దారుణ హత్యకు గురయ్యారు. తెలంగాణలోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లి వస్తుండగా వారు ప్రయాణిస్తున్న బైక్‌ను కారుతో ఢీకొట్టి కింద పడిన ఇద్దరినీ బండరాళ్లతో కొట్టి హత్య చేసిన ఘటన సంచలనం సృష్టించింది. ఈ జంట హత్యల కేసులో మొత్తం 9 మందిని నిందితులుగా చేర్చారు. వారిలో ఏ6గా మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఏ7గా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుడు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి పేరును ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారు. అయితే తమకు బెయిల్ మంజూరు చేయాలంటూ హైకోర్టును పిన్నెల్లి సోదరులు ఆశ్రయించారు. హైకోర్టులో పిన్నెల్లి బ్రదర్స్‌కు చుక్కెదురవడంతో సుప్రీంలో పిటిషన్ వేశారు. దీంతో కొద్దిరోజుల పాటు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది సుప్రీం కోర్టు. ఈ కేసు విచారణలో భాగంగా ఏపీ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు. నిందితులు విచారణకు సహకరించడం లేదని, సాక్షులను బెదిరిస్తున్నారంటూ కోర్టుకు తెలిపారు. వాదనలు విన్న సుప్రీం పిన్నెల్లి సోదరుల ముందస్తు బెయిల్ పిటిషన్లను కొట్టివేయడంతో పాటు వెంటనే అరెస్ట్ చేయాలని ఆదేశించింది. అయితే రెండు వారాల పాటు సమయం ఇవ్వాలని పిన్నెల్లి తరపున న్యాయవాది కోరారు. ఈ క్రమంలో పిన్నెల్లి సోదరులు లొంగపోయేందుకు రెండు వారాల పాటు సుప్రీం కోర్టు గడువు ఇచ్చింది. సుప్రీం ఆదేశాల మేరకు లొంగిపోయేందుకు నిర్ణయం తీసుకున్న పిన్నెల్లి సోదరులు ఈరోజు మాచర్ల కోర్టులో సరెండర్ అయ్యారు.


## లోకేష్ యూఎస్ పర్యటన.. ఏపీలో వేల కోట్ల పెట్టుబడులకు పునాది: మోహన కృష్ణ



అమెరికా, డిసెంబర్ 11: మంత్రి నారా లోకేష్ అమెరికా పర్యటన ఏపీలో వేల కోట్ల పెట్టుబడులకు పునాది అని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ అన్నారు. లోకేష్ యూఎస్ పర్యటలో మోహన్ కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ అమెరికా పర్యటన, ఏపీలో పెట్టుబడుల కోసం ఆయన శ్రమిస్తున్న తీరును మన్నవ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చడానికి లోకేష్ అవిశ్రాంతంగా కృషి చేశారని తెలిపారు. అమెరికాలో జెట్ లాగ్‌ను కూడా లెక్కచేయకుండా ఉదయం నుంచి రాత్రి దాకా దిగ్గజ కంపెనీల సీఈవోలతో బ్యాక్-టు-బ్యాక్ వరుస మీటింగ్‌లు జరిపి ఏపీకి పెట్టుబడులు తీసుకువచ్చేందుకు లోకేష్ పడిన శ్రమ అభినందనీయమని కొనియాడారు. యూఎస్ పర్యటనలో భాగంగా గూగుల్ సంస్థ సీఈవో సుందర్ పిచాయ్‌తో మంత్రి లోకేష్ సమావేశమై విశాఖపట్నంలో ఏఐ డేటా సెంటర్ ప్రాజెక్ట్ పనుల ప్రారంభంపై చర్చించారని తెలిపారు. విశాఖలో %వి%15బిలియన్ డాలర్ల పెట్టుబడులకు ముందుకు వచ్చినందుకు గూగుల్ ఉన్నతస్థాయి బృందానికి లోకేష్ కృతజ్ఞతలు తెలియజేసినట్లు చెప్పారు. ఇంటెల్ సంస్థ ఐటీ విభాగం సీటీవో శేష కృష్ణపురతో లోకేష్ సమావేశమై ఆంధ్రప్రదేశ్‌లో ఇంటెల్ ఉత్పత్తుల కోసం అసెంబ్లింగ్, టెస్టింగ్, మార్కింగ్, ప్యాకేజింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని కోరారన్నారు. అలాగే గేమింగ్, చిప్ డిజైనింగ్, జిపియు మ్యానుఫ్యాక్చరింగ్‌లో అంతర్జాతీయస్థాయి అగ్రగామి సంస్థ ఎన్ విడియా వైస్ ప్రెసిడెంట్ ఎంటర్ప్రైజ్ అండ్ క్లౌడ్ సేల్స్ రాజ్ మిర్ పూరితో శాంటాక్లారాలో మంత్రి భేటీ అయ్యారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలని ప్రతిపాదించినట్లు చెప్పారు. అలాగే అడోబ్ సీఈవో శంతను నారాయణన్‌తో మంత్రి లోకేష్ భేటీ అయ్యి విశాఖపట్నంలో అడోబ్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ లేదా డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరినట్లు మోహన కృష్ణ తెలిపారు. వీరితో పాటు జూమ్ వీడియో కమ్యూనికేషన్స్ ప్రొడక్ట్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ప్రెసిడెంట్ వెల్చామి శంకరలింగం, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అపర్ణ బావాతో మంత్రి సమావేశమై అమరావతి లేదా విశాఖపట్నంలో జూమ్ సంస్థ ఆర్ అండ్ డి/ ఇంజనీరింగ్ డెవలప్‌మెంట్ సెంటర్, విశాఖపట్నంలో ఒక జీసీసీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారని చెప్పారు. ఇచ్చిన మాట నిలబెట్టుకునేలా ఆంధ్రప్రదేశ్‌లో యువతకి 20 లక్షల ఉద్యోగాలు అందించేలా లోకేష్ నిరంతరం కష్టపడుతున్నారని తెలిపారు. లోకేష్ అమెరికా పర్యటనలో పాల్గొనటం, పర్యటన దిగ్విజయంగా జరగటం చాలా సంతోషంగా ఉందని మన్నవ మోహన కృష్ణ పేర్కొన్నారు.

## ఇంద్రకీలాద్రిపై దీక్షల విరమణ.. భారీగా తరలివచ్చిన భవానీలు





ఇంద్రకీలాద్రి: విజయవాడ ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణ కొనసాగుతోంది. దుర్గమ్మ సన్నిధిలో నేటి నుంచి ఈనెల 15 వరకు దీక్షల విరమణ మహోత్సవం కొనసాగుతుంది. ప్రధాన ఆలయం నుంచి కలశ జ్యోతులను తీసుకొచ్చి.. నిర్ణయించిన ముహూర్తానికి కనకదుర్గానగర్‌లో హోమగుండాల్లో అగ్ని ప్రతిష్ఠాపనతో విరమణ మహోత్సవం మొదలైంది. గిరిప్రదక్షిణ పూర్తి చేసి క్యూలైన్లో ఉన్న భవానీ దీక్షాధారులను దర్శనానికి అనుమతిస్తున్నారు. దీక్షల విరమణకు భారీగా భవానీ దీక్షాధారులు తరలివచ్చారు.

## జగన్ విమర్శలపై భాజపా దీటుగా కౌంటర్ ఇవ్వాలి: ప్రధాని మోదీ



దిల్లీ: ఏపీలో సీఎం చంద్రబాబుతో కలిసి ముందుకు సాగడం మంచి పరిణామమని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. రాష్ట్రంలో పరిపాలనపై కూడా మంచి ఫీడ్ బ్యాక్ వచ్చిందని చెప్పారు. గురువారం దిల్లీలో ఏపీ, తెలంగాణ, అండమాన్ రాష్ట్రాల భాజపా ఎంపీలకు ప్రధాని అల్పాహార విందు ఇచ్చారు. 15 మంది ఎంపీలతో సుమారు అరగంటపాటు ఆయన మాట్లాడారు. పెట్టుబడులు ఎక్కువగా ఆంధ్రప్రదేశ్ వైపు వెళుతున్నాయని.. ఇది చాలా మంచి అభివృద్ధి అని మోదీ కితాబిచ్చినట్లు సమాచారం. వైకాపా అధ్యక్షుడు జగన్, ఆయన పార్టీ సోషల్ మీడియాలో చేస్తున్న విమర్శలకు భాజపా కూడా దీటుగా కౌంటర్ ఇవ్వాలని ప్రధాని దిశానిర్దేశం చేశారు.

**తెలంగాణ ఎంపీలపై ఆగ్రహం!...** "తెలంగాణలో ప్రతిపక్ష పాత్ర కూడా పోషించడం లేదు. మంచి టీమ్‌ని పెట్టుకుని సమర్థంగా ఎదుర్కోవడానికి సమస్యేంటి? రాష్ట్రంలో పార్టీ గ్రాఫ్ పెరగడానికి మంచి అవకాశం ఉన్నా దాన్ని ఉపయోగించుకోవడంలో విఫలమవుతున్నారు" అని మోదీ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. జాతీయ పరిణామాలపై తెలుగు ఎంపీలు యాక్టివ్‌గా ఉండాలని, పలు రాష్ట్రాల్లో పర్యటించి ఆయా అంశాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేయాలని ఆయన సూచించారు.

## ములకలచెరువు నకిలీ మద్యం కేసు.. తెదేపా బహిష్కృత నేత జయచంద్రారెడ్డి అరెస్ట్

ములకలచెరువు: అన్నమయ్య జిల్లా ములకలచెరువులో బయటపడ్డ నకిలీ మద్యం తయారీ కేసులో తెదేపా బహిష్కృత నేత జయచంద్రారెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో కీలక నిందితుడిగా ఉన్న ఆయన్ను బెంగళూరులో ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేసి రాష్ట్రానికి తీసుకొస్తున్నారు. నకిలీ మద్యం తయారీ కేసులో ప్రధాన సూత్రధారిగా ఉన్న అద్దేపల్లి జనార్దన్‌రావుకు జయచంద్రారెడ్డి ఆర్థిక సహకారం, అండదండలు అందించినట్లు ఆరోపణలు ఉన్నాయి. మద్యం తయారీ వ్యవహారమంతా ఆయన కనుసన్నల్లోనే సాగినట్లు రిమాండ్ రిపోర్టులో పోలీసులు పేర్కొన్నారు. ఈ కేసులో ఇప్పటివరకు 31 మంది నిందితులను అరెస్ట్ చేయగా.. జయచంద్రారెడ్డి అరెస్ట్‌తో ఆ సంఖ్య 32కి చేరింది. ఆయన్ను మదనపల్లె ఎక్సైజ్ కార్యాలయానికి తీసుకొచ్చి విచారించనున్నట్లు సమాచారం.



## సాంప్రదాయంగా ఆకట్టుకుంటున్న రుక్మిణీ వసంత్!

అదృష్టం అనేది ఎప్పుడు ఎవరి తలుపు ఎలా తడుతుందో చెప్పడం అసాధ్యం. అందుకే ఆ అదృష్టం పట్టినప్పుడే సద్వినియోగం చేసుకోవాలని పెద్దలు కూడా చెబుతూ ఉంటారు. ఈ క్రమంలోనే తన అద్భుతమైన నటనతో ఏకంగా వరుసగా పాన్ ఇండియా చిత్రాలలో అవకాశాలు అందుకుంటూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది రుక్మిణీ వసంత్. 2024లో 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' అనే చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించిన ఈమె.. ఇటీవల రిషబ్ శెట్టి దర్శకత్వంలో వచ్చిన 'కాంతార' సీక్వెల్ 'కాంతార చాప్టర్ 1' లో హీరోయిన్ గా అవకాశం అందుకొని భారీ పాపులారిటీ సొంతం చేసుకుంది. ముఖ్యంగా తన అందంతోనే కాదు నటనతో అందరినీ అబ్బురపరిచిన ఈమె.. కొన్ని కొన్ని సన్నివేశాలలో హీరో రిషబ్ శెట్టి కంటే కూడా అద్భుతంగా నటించి అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఈ సినిమా ఇచ్చిన క్రేజ్ తో ఈమె లెవెల్ భారీగా పెరిగిపోయింది అనడంలో సందేహం లేదు. ఇందులో సాంప్రదాయంగా మహారాణి కనకావతీ పాత్రలో అద్భుతంగా ఒదిగిపోయింది. అయితే అలాంటి ఈమె తాజాగా సోషల్ మీడియాలో యాక్టివ్ అయిపోయిందని చెప్పవచ్చు. అందులో భాగంగానే ఇంస్టాగ్రామ్ వేదికగా కొన్ని ఫోటోలు షేర్ చేయగా అందులో అందరి దృష్టిని ఆకర్షించింది అని చెప్పవచ్చు.



అసలు విషయంలోకి వెళ్తే.. తాజాగా పూజా కన్నన్ డిజైన్ చేసిన పర్పుల్ కలర్ లెహంగా ధరించి తన అందాలతో మరొకసారి మెస్మరైజ్ చేసింది. దీనికి కాంబినేషన్లో కలంకారీ తో డిజైన్ చేసిన పైటతో తన మేకోవర్ను ఫుల్ ఫిల్ చేసింది. పగడాలు పొదిగిన సింపుల్ జువెలరీ తో తన అందాన్ని మరింత రెట్టింపు చేసిందని చెప్పవచ్చు. మొత్తానికైతే పర్పుల్ కలర్ లెహంగాలో చాలా సాంప్రదాయంగా కనిపించి అందరి దృష్టిని ఆకట్టుకుంటుంది రుక్మిణి వసంత్. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. రుక్మిణి వసంత్ సినిమాల విషయానికి వస్తే.. రక్షిత్ శెట్టి హీరోగా హేమంత్ ఎం రావు దర్శకత్వంలో వచ్చిన 'సప్త సాగరాలు దాటి' అనే చిత్రంతో లైమ్ లైట్ లోకి వచ్చింది ఈ ముద్దుగుమ్మ. ఇకపోతే తమిళంలో ఎస్ అనే చిత్రంలో నటించిన ఈమె.. ఆ తర్వాత ఏ. ఆర్.మురగదాస్ దర్శకత్వంలో శివ కార్తికేయన్ హీరోగా నటించిన మదరాసి సినిమాలో హీరోయిన్గా నటించింది. ఈ సినిమా ఈ ఏడాది సెప్టెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. కానీ అనుకున్నంత స్థాయిలో సక్సెస్ కాలేదు. ప్రస్తుతం మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్ లో ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా చేస్తున్న డ్రాగన్ సినిమాలో హీరోయిన్గా అవకాశం అందుకుంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. 1994 డిసెంబర్ 10న కర్ణాటకలోని బెంగళూరులో కన్నడ మాట్లాడే కుటుంబంలో జన్మించింది. ఈమె తండ్రి కల్నల్ వసంత్ వేణుగోపాల్. భారతదేశ అత్యున్నత శాంతి కాల సైనిక అలంకరణ అయిన అశోక చక్ర కర్ణాటక రాష్ట్రం నుండి పొందిన మొదటి వ్యక్తిగా పేరు దక్కించుకున్నారు.

## పెళ్లి విషయంలో ఓపెన్ అయిన ముద్దుగుమ్మ

మలయాళ ముద్దుగుమ్మ అనుపమ పరమేశ్వరన్ సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టి దశాబ్ద కాలం పూర్తి చేసుకుంది. 2015 సంవత్సరంలో మలయాళం మూవీ ప్రేమమ్‌తో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ఈ అమ్మడు తక్కువ సమయంలో ఎక్కువ సినిమాలు చేసింది. కెరీర్ ఆరంభంలో ఈ అమ్మడు మలయాళ సినిమాలకే పరిమితం అవుతుందని అంతా అనుకున్నారు. కానీ లక్కీగా ఈ అమ్మడికి మొదటగా తమిళ్‌లో కోడి అనే సినిమాలో ఛాన్స్ దక్కింది. ఆ సినిమా తర్వాత తెలుగులో అ ఆ, ప్రేమమ్ సినిమాలో నటించడం ద్వారా టాలీవుడ్ ప్రేక్షకులకు చేరువ అయింది. టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన ఏడాదిలోనే మంచి స్టార్డం దక్కించుకుంది. అ ఆ సినిమాలో అనుపమ



నటనకు మంచి మార్కులు పడ్డాయి. ఆ సినిమా సూపర్ హిట్ కావడంతో అంతా ఆమెను అభిమానించడం మొదలు పెట్టారు, ఆ తర్వాత ప్రేమమ్ సినిమా ఆమె స్థాయిని మరింతగా పెంచేసింది.

**ప్రేమమ్‌తో టాలీవుడ్‌లో ఎంట్రీ...** తెలుగులో ఈమె 2017లో చేసిన శతమానం భవతి సూపర్ హిట్ కావడంతో వెనక్కి తిరిగి చూసే అవకాశం రాలేదు. ఇప్పటికీ టాలీవుడ్, కోలీవుడ్, మలయాళం ఇలా అన్ని భాషల సినిమా ఇండస్ట్రీలోనూ సినిమాలు చేస్తూ బిజీ బిజీగా ఉంది. దక్షిణాదిన అన్ని భాషల్లో నటించిన హీరోయిన్‌గా అనుపమ పరమేశ్వరన్ నిలిచింది. ఆకట్టుకునే అందం తో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం కావడంతో లేడీ ఓరియంటెడ్ సినిమాలకు సైతం ఈమెకు ఆఫర్లు వస్తున్నాయి. ఇటీవల ఈమె పరదా సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమాలో మంచి కాన్సెప్ట్‌ను చూపించినా కమర్షియల్‌గా నిరాశ పరిచింది. అయినా కూడా ఈ అమ్మడి క్రేజ్ తగ్గలేదు. ప్రస్తుతం ఈ అమ్మడి చేతిలో పలు సినిమాలు ఉన్నాయి. ఒకటి రెండు షూటింగ్ దశలో ఉంటే కొన్ని సినిమాలు చర్చల దశలో ఉన్నట్లుగా సమాచారం అందుతోంది.

**అనుపమ పరమేశ్వరన్ పెళ్లి విషయంలో...** ఈ ఏడాది ఏకంగా ఆరు సినిమాలతో వచ్చిన అనుపమ పరమేశ్వరన్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తన పెళ్లి విషయమై ఓపెన్ అయింది. మూడు పదుల వయసుకు చేరువ అవుతున్న నేపథ్యంలో అనుపమ పరమేశ్వరన్ పెళ్లి ఎప్పుడు అంటూ చాలా మంది అడుగుతూ ఉన్నారు. ఆ మధ్య అనుపమ పరమేశ్వరన్ ప్రేమలో ఉందనే వార్తలు తెగ వచ్చాయి. కానీ అవి పుకార్లే అని ఆ తర్వాత క్లారిటీ వచ్చింది. అనుపమ పరమేశ్వరన్ ఇటీవల ఒక చిట్ చాట్ సందర్భంగా ప్రేమ వివాహం గురించి స్పందించి అందరిని సర్‌ప్రైజ్ చేసింది. ప్రేమలో లేదని అంతా అనుకుంటున్న సమయంలో అనూహ్యంగా ఈ అమ్మడు తాను ప్రేమ వివాహం చేసుకుంటాను అని చెప్పడం ద్వారా కచ్చితంగా ఈమె ప్రేమలో ఉందని కొత్త ప్రచారం మొదలు అయింది. అయితే ఆమె మాత్రం ప్రేమ ఉన్నట్లు మాత్రం క్లారిటీ ఇవ్వలేదు.




## పెళ్లైన తర్వాత తొలి రిలీజ్ అఖిల్ కి కలిసొచ్చేనా?



అక్కినేని వారసుడు అఖిల్ కెరీర్ లో సరైన సక్సస్ ఏది అంటే ఇంత వరకూ చెప్పుకునే చిత్రం ఒకే ఒక్కటి. అదే 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్లర్'. ఈ సినిమా మినహా చేసిన సినిమాలన్నీ వృద్ధా ప్రయత్నాలుగానే కనిపిస్తాయి. కొన్ని చిత్రాలు యావరేజ్ గా ఆడినప్పటికీ అక్కినేని రేంజ్ చిత్రాలు కావవి. 'ఏజెంట్' తో యాక్షన్ స్టార్ అవుతాడు అనుకున్నారు. కానీ ఆ సినిమా పరాజయం అఖిల్ ను అంతకంతకు కిందకు లాగేసింది. ఇలా ఇన్ని పరాజయాలు అఖిల్ వేగాన్ని కూడా తగ్గించాయి. నాటి నుంచి కథలు..దర్శకుల విషయంలో సెలక్టివ్ గా ఉండటం మొదలు పెట్టాడు.

**వాళ్లందరికీ ఇది షాక్:** మునుపటిలా తొందరపడి ఏ సినిమాకు ఒకే చెప్పడం లేదు. అవసరమైతే ఇంట్లో వారి సలహాలు తీసుకుంటున్నాడు. తన నిర్ణయాలపై నే కాకుండా? పెద్దవారిని కూడా సంప్రదించి అందరికీ ఒకే అనుకుంటనే ముందుకెళ్లడం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలోనే అఖిల్ పెళ్లి కూడా జరిగింది. పెద్దలు చూసిన అమ్మాయినే అఖిల్ వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. అఖిల్ ఇండస్ట్రీకి వచ్చిన వేగం చూసి ప్రేమలో పడి ఆ తరహా వివాహనికే ఆసక్తి చూపిస్తాడనే విశ్లేషణలు ఆరంభంలో వ్యక్తమయ్యాయి. కానీ వారందరికీ షాక్ ఇచ్చి డాడ్ చూసిన సంబంధాన్నే చేసుకున్నాడు.

**రాయలసీమ నేపథ్యమే కొత్తగా:** వివాహమైతే జీవితంలో కొన్ని కొన్ని మార్పులు వస్తాయంటారు. మరి అఖిల్ విషయంలో ఎలాంటి ఛేంజెస్ వస్తాయో చూడాలి. ప్రస్తుతం అఖిల్ 'లెనిన్' అనే సినిమాలో నటిస్తోన్న సంగతి తెలిసిందే. 'ఏజెంట్' ప్లాప్ తర్వాత కమిట్ అయిన చిత్రమిది. అలాగే పెళ్లైన తర్వాత రిలీజ్ అవుతున్న తొలి చిత్రం కూడా ఇదే. దీంతో 'లెనిన్' సక్సస్ పై అక్కినేని కుటుంబమే కాదు ఆయన అభిమానులు కూడా చాలా ఆశలు పెట్టుకున్నారు. ఈ సినిమాతో అఖిల్ పెద్ద విజయం అందుకోవాలని ఆకాంక్షిస్తున్నారు. %-%లెనిన్%-% కథ కూడా రొటీన్ కు భిన్నమైన చిత్రమేమి కాదు.

**వివాహం తో కొత్త ప్రయాణం:** రాయలసీమ బ్యాక్ డ్రాప్ స్టోరీ. ఓ కుటుంబ నేపథ్యంలో సాగే కథనే కొత్తగా చెప్పబోతున్నారు. సీమ యువకుడి పాత్రలో అఖిల్ నటించడం అన్నది ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచుతుంది? అనడంలో ఎలాంటి సందేహం లేదు. %-%లెనిన్%-% కూడా వచ్చే ఏడాది రిలీజ్ అయ్యే సినిమాగానే కనిపిస్తోంది. సెట్స్ కు వెళ్లి కొన్ని నెలలు గడుస్తున్నా? షూటింగ్ నెమ్మదిగా జరుగుతోంది. ఇదే సమయంలో అఖిల్ పెళ్లి కూడా చేసుకోవడంతో మరింత గ్యాప్ ఏర్పడింది. వివాహం..హానీమూన్ అంటూ సెలవులు తీసుకున్నాడు. ప్రస్తుతం మాత్రం సెట్స్ కు హాజరవుతున్నాడు అనుకోండి.

## రెబల్ రాజా సాబ్.. కొత్త ట్రెండ్ సెట్ చేస్తాడా..?



రెబల్ స్టార్ ప్రభాస్ రాజా సాబ్ మారుతి డైరెక్షన్ లో తెరకెకుతున్న విషయం తెలిసిందే. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న ఈ సినిమాకు థమన్ మ్యూజిక్ అందిస్తున్నాడు. ఈ సినిమాలో ప్రభాస్ తో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్ హీరోయిన్స్ గా నటిస్తున్నారు.

2026 సంక్రాంతి రేసులో దిగుతున్న రాజా సాబ్ సినిమా ట్రైలర్ ఆల్రెడీ రిలీజైంది. సినిమా కోసం మరో ట్రైలర్ ని రెడీ చేస్తున్నాడట డైరెక్టర్ మారుతి. ఐతే రాజా సాబ్ రెండో ట్రైలర్ సినిమాలో సీన్స్ తో కాకుండా కాన్సెప్ట్ వీడియో చేస్తున్నారట.

**సినిమాకు శాంపిల్ గా ఎలా ఉంటుందో..** కల్కి 2898 %ూణ% సినిమా కోసం నాగ్ అశ్విన్ ఎలాగైతే పాత్రలను పరిచయం చేస్తూ ఎలా అయితే ఒక సీరీస్ రిలీజ్ చేశాడో ఇప్పుడు మారుతి కూడా సినిమాలో లేని సీన్స్ తో.. ప్రత్యేకంగా ఒక స్పెషల్ ట్రైలర్ రెడీ చేస్తారట. ఇందుకోసం సెపరేట్ షూటింగ్ కూడా చేస్తున్నారని తెలుస్తుంది. ఇది క్లిక్ అయితే మాత్రం ఇక మీదట అందరు ఇదే ఫార్ములా ఫాలో అయ్యే ఛాన్స్ ఉంటుంది. అసలైతే సినిమా ట్రైలర్ అంటే సినిమాకు శాంపిల్ గా ఎలా ఉంటుందో అని చెప్పే ప్రయత్నం చేస్తారు. కానీ రాజా సాబ్ టీం మాత్రం సినిమా కాన్సెప్ట్ ని డిఫరెంట్ గా ప్రమోట్ చేయబోతున్నారట. తప్పకుండా ఈ అటెంప్ట్ సంథింగ్ డిఫరెంట్ గా ఉండే ఛాన్స్ ఉందని చెప్పొచ్చు. రాజా సాబ్ కోసం మారుతి రాత్రి పగలు తేడా లేకుండా కష్టపడుతున్నట్టు తెలుస్తుంది.

**రాజా సాబ్ ఫ్రాంచైజీగా..** ఈ సినిమాతో సక్సెస్ అందుకుని ప్రభాస్ తో మరో సినిమా అది రాజా సాబ్ ఫ్రాంచైజీగా తీయాలనే ప్లానింగ్ లో ఉన్నాడు మారుతి. పీపుల్ మీడియా మాత్రం మారుతికి ఫ్రీ హ్యాండ్ ఇచ్చారు. సినిమా బాగా వచ్చేందుకు ఎంత బడ్జెట్ అయినా పెట్టేందుకు రెడీ అనేస్తున్నారు. సో రాజా సాబ్ తో మారుతి కూడా పాన్ ఇండియా డైరెక్టర్స్ లిస్ట్ లో జాయిన్ అవుతున్నాడన్నమాట. సంక్రాంతికి వస్తున్న రాజా సాబ్ భారీ టార్గెట్ తో దిగుతుంది. రాజా సాబ్ సినిమాలో థమన్ మ్యూజిక్ కూడా మేజర్ హైలెట్ అయ్యేలా ఉంటుందట. సినిమా కాన్సెప్ట్ కు థమన్ బిజిఎం మరింత క్రేజీగా ఉంటుందని తెలుస్తుంది. మారుతి ప్రభాస్ కాంబినేషన్ లో వస్తున్న రాజా సాబ్ నిజంగానే రెబల్ ఫ్యాన్స్ కి ఫీస్ట్ ఇస్తుందా లేదా అన్నది సంక్రాంతి రిలీజ్ దాకా వెయిట్ చేయాల్సిందే. రాజా సాబ్ రెండో ట్రైలర్ పై సోషల్ మీడియాలో డిస్కషన్ మొదలైంది. సినిమాలో లేని సీన్స్ తో ట్రైలర్ అంటే ఆడియన్స్ లో కూడా క్యూరియాసిటీ పెరిగింది. మరి మారుతి ఈ అటెంప్ట్ ని ఎలా తీసుకొస్తారన్నది చూడాలి.

## ఆశా మేరీపై ఎన్నో ఆశలు!

కొన్ని సినిమాల్లో హీరో హీరోయిన్ల క్యారెక్టర్ల కంటే కూడా ఇంకొందరు చేసే పాత్రలే సినిమాపై ఆసక్తిని పెంచుతాయి. ఇప్పుడలాంటి సిట్యుయేషన్సే ఏర్పడ్డాయి. ప్రియదర్శి, ఆనంది ప్రధాన పాత్రల్లో వస్తోన్న ప్రేమంటే సినిమాలో నటి, యాంకర్ సుమ కీలక పాత్రలో కనిపించనున్నారు. కామెడీ ప్రధానంగా వస్తోన్న ఈ మూవీలో సుమ క్యారెక్టర్ నవ్వుల్ని పూయించడమే కాకుండా ఆడియన్స్ ను అలరించడం ఖాయమనే అనిపిస్తోంది.

**ఎంతమంది వచ్చినా ఆమె ప్లేస్ మారలేదు...** తెలుగు ఆడియన్స్ అందరికీ సుమ పరిచయస్తురాలే. కేవలం యాంకర్ గా మాత్రమే కాకుండా సినిమాల్లో తన కామెడీ టైమింగ్ తో అభిమానులను అలరిస్తూ వస్తున్నారు సుమ. ఇండస్ట్రీలోకి ఎంతోమంది కొత్త యాంకర్లు వస్తున్నప్పటికీ, సుమ స్థానం మాత్రం చెక్కు చెదరలేదు. ఇప్పటికీ పెద్ద సినిమాల ఈవెంట్ అంటే దానికి హోస్ట్ గా సుమ నే ఉంటారు. తన కామెడీ టైమింగ్ తో ఆడియన్స్ ను ఎట్రాక్ట్ చేస్తూ ఎంతో హుందాగా ఈవెంట్స్ ను హోస్ట్ చేస్తుంటారు సుమ.

**జయమ్మ పంచాయితీలో ఆఖరిగా కనిపించిన సుమ...** అలాంటి సుమ ఆఖరిగా జయమ్మ పంచాయితీ అనే సినిమాలో నటించారు ఆ సినిమా ఆడకపోయినా, సుమ తన యాక్టింగ్ తో ఆడియన్స్ ను ఆకట్టుకున్నారు. ఆ సినిమాలో ఎంతో నేచురల్ ఎమోషన్స్ తో సుమ నటించిన తీరు, దానికి కామెడీని జోడించిన విధానం అందరినీ ఎట్రాక్ట్ చేసింది. ఇప్పుడు సుమ, నవనీత్ శ్రీరామ్ దర్శకుడిగా పరిచయమవుతూ వస్తోన్న ప్రేమంటే



అనే రొమాంటిక్ థ్రిల్లర్ లో కీలక పాత్రలో కనిపించనున్నారు.

**పోలీస్ పాత్రలో సుమ..** మొదటి నుంచే ఈ సినిమాకు మంచి బజ్ ఉంది. సినిమా ముహూర్తానికి రానా క్లాప్ కొట్టడం, సందీప్ రెడ్డి వంగా కెమెరా స్విచ్ఛాన్ చేయడంతో పూజా కార్యక్రమాల నుంచే ప్రేమంటే అందరి దృష్టినీ ఆకర్షించింది. అయితే ఈ సినిమాలో సుమ ఆశా మేరీ అనే పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ఫస్ట్ లుక్ పోస్టర్ లో సుమ పోలీస్ యూనిఫాంలో అందరి దృష్టినీ ఆకర్షించారు.

**సినిమాలో హైలైట్ గా సుమ సీన్స్..** అయితే ఈ సినిమాలో సుమ క్యారెక్టర్ పోలీస్ అయినప్పటికీ ఆమె తన వృత్తి రీత్యా పెద్దగా స్ట్రిక్ట్ ఆఫీసరేమీ కాదు. పోలీసు క్యారెక్టర్ లో కూడా సుమ కామెడీ చేస్తూ కనిపించనున్నారని ఆల్రెడీ రిలీజైన కంటెంట్ చూస్తుంటే క్లారిటీ వస్తోంది. పోలీస్ ఆఫీసర్ పాత్రలో సుమ ఎలాంటి కామెడీ చేసి అలరించనున్నారో అని చూడ్డానికి ఆడియన్స్ ఎంతో ఎగ్జైటింగ్ గా ఉన్నారు. సినిమాలో ప్రియదర్శి, ఆనంది లీడ్ రోల్స్ చేసినప్పటికీ ప్రేమంటే లో సుమ నటించిన కొన్ని సీన్స్ సినిమా మొత్తానికే హైలైట్ గా నిలిచాయని, ఆమె పాత్రపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు చిత్ర మేకర్స్. మరి ఆశా మేరీ ఆడియన్స్ ను ఏ మేర అలరించి, ఆకట్టుకుంటుందో చూడాలి.

## ది గర్ల్ ఫ్రెండ్... అత్యధిక రేటుతో రికార్డ్

నేషనల్ క్రష్ రష్మిక మందన్న ఈ ఏడాది ఇప్పటి వరకు ఛావా, సికిందర్, కుబేరా, థామా సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఛావా సినిమా బాక్సాఫీస్ వద్ద బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. సల్మాన్ ఖాన్‌తో నటించిన సికిందర్ సినిమా డిజాస్టర్‌గా నిలిచింది. అయితే ధనుష్ తో కలిసి నటించిన కుబేరా సినిమా మాత్రం వంద కోట్లకు మించి వసూళ్లు రాబట్టి హిట్ చిత్రాల జాబితాలో నిలిచింది. థామా సినిమా మిశ్రమ స్పందన దక్కించుకుంది. అయితే ప్రతి సినిమా కూడా రష్మిక మందన్న స్థాయిని పెంచుతూనే వచ్చింది. ఆకట్టుకునే అందం తో పాటు తన నటనతో సినిమాల స్థాయిని పెంచుతూ ఉన్న రష్మిక మందన్న తన మోస్ట్ అవైటెడ్ లేడీ ఓరియంటెడ్ సినిమాను ఈ ఏడాదిలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చేందుకు రెడీ అయింది.

**రష్మిక మందన్న హీరోయిన్‌గా ది గర్ల్ ఫ్రెండ్...** రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా ట్రైలర్ తాజాగా విడుదలైంది.



టీజర్ విడుదల సమయంలోనే మ్యాటర్ ఉన్న సినిమా అనిపించింది. ఇప్పుడు ట్రైలర్ చూసిన తర్వాత ప్రతి ఒక్కరూ సినిమా విడుదల తేదీ ఎప్పుడు అని చెక్ చేస్తున్నారు. రష్మిక మందన్న తన నటన విశ్వరూపం చూపించినట్లుగా నటించిందని ట్రైలర్ చూస్తే అనిపిస్తుంది. ట్రైలర్ కట్ తో సినిమాపై అంచనాలు, ఆసక్తి పెంచారు. నవంబర్ 7న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ది గర్ల్ ఫ్రెండ్ సినిమా సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ప్రేక్షకులు సినిమా కోసం ఎదురు చూడటం, థియేట్రికల్ రిలీజ్ కి ఉన్న బజ్ నేపథ్యంలో ఈ సినిమాను ప్రముఖ ఓటీటీ నెట్‌ఫ్లిక్స్ కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చింది. పలు ఓటీటీ సంస్థలు ముందుకు వచ్చినప్పటికీ నెట్‌ఫ్లిక్స్ వారు ఈ సినిమాను భారీ మొత్తాన్ని చెల్లించి దక్కించుకున్నట్లు తెలుస్తోంది.

**రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో..** ఇండస్ట్రీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం ది గర్ల్ ఫ్రెండ్ సినిమాకు గాను నెట్‌ఫ్లిక్స్ ఇండియా వారు దాదాపుగా రూ. 14 కోట్ల పెట్టినట్లు తెలుస్తోంది. ఒక లేడీ ఓరియంటెడ్ మూవీకి ఈ మొత్తం ఖచ్చితంగా ఎక్కువగా చెబుతున్నారు. మీడియం రేంజ్ బడ్జెట్ మూవీకి ఈ స్థాయి బిజినెస్ జరగడం రికార్డ్ అంటున్నారు. తప్పకుండా ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకుంటుందనే విశ్వాసం ను వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో కొందరు ఈ సినిమా థియేట్రికల్ రన్ విషయంలో దెబ్బ తీసినా కచ్చితంగా ఓటీటీలో సూపర్ హిట్‌గా నిలిచే కంటెంట్ అంటున్నారు. రష్మిక మందన్న కోసం అయినా సినిమాను ఓటీటీ లో చూసేందుకు ప్రేక్షకులు నెట్‌ఫ్లిక్స్ లో లాగిన్ అవుతారు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అందుకే ముందు చూపుతో నెట్‌ఫ్లిక్స్ ది గర్ల్ ఫ్రెండ్ సినిమాను భారీ మొత్తానికి కొనుగోలు చేసినట్లు చెబుతున్నారు.




పైలట్ల కొరత వంటి కారణాలతో కొన్నిరోజుల పాటు తీవ్ర సంక్షోభంలో చిక్కుకుపోయిన దేశీయ విమానయాన సంస్థ ఇండిగో.. పూర్తిస్థాయిలో కార్యకలాపాలను అందుబాటులోకి తీసుకువస్తోంది. ఈ రోజు నడపనున్న 1950కి పైగా సర్వీసుల్లో మూడు లక్షల మంది ప్రయాణించనున్నారని వెల్లడించింది. అదే సమయంలో సర్వీసుల రద్దు కారణంగా ఇబ్బంది పడిన ప్రయాణికులకు రూ.10వేల విలువైన వోచర్‌ను పరిహారం కింద ఇస్తామని తెలిపింది. డిసెంబర్ 3-5 మధ్య సర్వీసుల రద్దు కారణంగా ప్రయాణికులు ఎయిర్‌పోర్టుల్లో చిక్కుకుపోయారు. ఆ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయిన సంగతి తెలిసిందే. అలా తీవ్రంగా ఇబ్బందులుపడిన ప్రయాణికులకు (వీరిని ఎలా ఎంపిక చేస్తుందో మాత్రం వెల్లడించలేదు) ఇండిగో పరిహారం ప్రకటించింది. వారికి ఈ ట్రావెల్ వోచర్లు ఇవ్వనున్నట్లు వెల్లడించింది. రానున్న 12 నెలల్లో ఇండిగో ప్రయాణంలో వాటిని వాడుకోవచ్చని తెలిపింది. విమానం బయల్దేరడానికి 24 గంటలలోగా విమాన సర్వీసు రద్దయితే.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇవ్వాల్సిన పరిహారానికి ఇది అదనమని తెలిపింది. "ఇండిగో (%×అఎఅస్త్రశీ%) తన కార్యకలాపాలను బలోపేతం చేస్తోంది. సర్వీసుల పునరుద్ధరణ రోజురోజుకూ మెరుగవుతోంది. ఈ రోజు మా నెట్‌వర్క్ పరిధిలోని 138 గమ్యస్థానాలను అనుసంధానించేలా మా సర్వీసులు కొనసాగనున్నాయి" అని స్టాక్ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో ఇండిగో వెల్లడించింది. వాతావరణం, సాంకేతిక, నియంత్రణలోని కొన్ని కారణాల వల్ల మాత్రమే స్వల్ప సంఖ్యలో సర్వీసులు రద్దవుతున్నాయని చెప్పింది. ఇటీవల వారం రోజులకు పైగా ఈ విమానయాన సంస్థ వందల కొద్ది సర్వీసుల్ని రద్దు చేసింది. దాంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. కేంద్రం కూడా ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకొని, దర్యాప్తు కమిటీ వేసింది. ఇదిలా ఉంటే.. తమ సేవలు గాడిన పడుతున్నాయని డిసెంబర్ 9న సంస్థ సీఈఓ పీటర్ ఎల్బర్స్ వెల్లడించిన సంగతి తెలిసిందే. మామూలుగా అయితే ఈ సంస్థ రోజూ 2,200పైగా సర్వీసుల్ని నడుపుతుంటుంది.

## సర్పంచి ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం.. ప్రజల విశ్వాసానికి నిదర్శనం: మ హేశ్‌గౌడ్



హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచి ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారుల విజయం.. ప్రజల విశ్వాసానికి నిదర్శనమని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. పంచాయతీ ఎన్నికల తొలి విడతలో.. కాంగ్రెస్ మద్దతుదారులైన అభ్యర్థులు ఘన విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికల్లో సామాజిక న్యాయం స్పష్టంగా కనిపించిందన్నారు. మొదటి విడత ఎన్నికల్లో 90 శాతం కంటే ఎక్కువ స్థానాల్లో కాంగ్రెస్ అనుబంధ అభ్యర్థులే గెలుపొందడం.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల ఆశయాలకు అద్దం పట్టే ఈ ఫలితాలు, ప్రభుత్వంపై వారి అపార నమ్మకాన్ని తిరిగి చాటుతున్నాయని టీపీసీసీ అధ్యక్షుడు విడుదల చేసిన ప్రకటనలో అభిప్రాయపడ్డారు. పంచాయతీ ఎన్నికలను కాంగ్రెస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో, పార్టీ తరఫున ఎన్నికల పర్యవేక్షణలో కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. నిరంతరం మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక నాయకులను సమన్వయం చేస్తూ గ్రామ స్థాయి వరకు ప్రచార వ్యూహాలు రూపొందించి అమలు చేసిన విధానమే ఈ విజయానికి ప్రధాన కారణమన్నారు. గ్రామీణ స్థాయిలో పార్టీని బలోపేతం చేసే క్రమంలో, ప్రజలను నేరుగా కలిసే పద్ధతి కాంగ్రెస్‌కు మరింత అనుకూలంగా మారిందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెండు సంవత్సరాల ప్రజాపాలన సంక్షేమం- అభివృద్ధి పథకాలతో ప్రజలకు చేరువైందని, ప్రజా పాలన పట్ల ప్రజల సంతృప్తి పంచాయతీ ఎన్నికల్లో స్పష్టంగా ప్రతిఫలించిందని మహేశ్‌గౌడ్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు.. గ్రామస్థాయి సమస్యలను అర్థం చేసుకుని వాటి పరిష్కారానికి కట్టుబడి పనిచేయడం, గ్రామీణ ఓటర్లలో కాంగ్రెస్‌పై విశ్వాసం పెరిగేందుకు కారణమైందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మైనారిటీలు, దళితులు, గిరిజనులు, మహిళలు, రైతులు, యువత విస్తృతంగా కాంగ్రెస్‌కు మద్దతు తెలపడం, గ్రామ పాలనా వ్యవస్థలో నూతన దిశకు సంకేతం అని వ్యాఖ్యానించారు.

ఈ విజయం పార్టీకి మరింత బాధ్యతను పెంచిందని.. గ్రామీణ అభివృద్ధిని మరింత వేగవంతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి ప్రాధాన్యత కేంద్రంగా మార్చే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు.

## కొండా సురేఖకు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ




హైదరాబాద్, డిసెంబర్ 11: తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖపై నాంపల్లిలోని ప్రత్యేక కోర్టు గురువారం నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ దాఖలు చేసిన పరువు నష్టం దావా కేసులో మంత్రి కొండా సురేఖపై ఈ నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. అనంతరం ఈ కేసు విచారణను వచ్చే ఏడాది ఫిబ్రవరి 5వ తేదీకి నాంపల్లి ప్రత్యేక కోర్టు వాయిదా వేసింది. ఈ కేసులో సుదీర్ఘ విచారణ జరిగింది. ఈ విచారణ సమయంలో మంత్రి కొండా సురేఖ వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకాలేదు. దీనిపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కేసు తదుపరి విచారణ ఫిబ్రవరి 5వ తేదీన వ్యక్తిగతంగా హాజరు కావాలని కొండా సురేఖను కోర్టు ఆదేశించింది.

**ఇంతకీ వివాదం ఏమిటంటే..?...** గతంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ విమర్శలు చేసే క్రమంలో.. నాగచైతన్య, సమంత విడాకులపై తీవ్ర అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. ఇవి వివాదాస్పదమైనాయి. దీనిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాంపల్లిలోని ప్రత్యేక కోర్టును ఆశ్రయించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తనపై ఆరోపణలు చేశారంటూ.. తన పరువుకు నష్టం కలిగించేలా మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు చేశారంటూ ఆయన కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గతంలో తాను మంత్రిగా పని చేశానని.. పార్టీకి కార్యనిర్వాహక అధ్యక్షుడి ఉన్నానని ఆయన కోర్టుకు తెలిపారు. ఈ కేసు విచారణలో భాగంగా సాక్షులుగా ఉన్న బీఆర్ఎస్ పార్టీ నేతలు బాల్కా సుమన్, సత్యవతి రాథోడ్, తుల ఉమ, దాసోజ్ శ్రవణ్ స్టేట్‌మెంట్లను సైతం కోర్టు రికార్డు చేసింది. కోర్టులో ఈ కేసు విచారణ ప్రస్తుతం కొనసాగుతోంది. ఇక మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలను హీరో అక్కినేని నాగార్జున తప్పు పట్టారు. కొండా సురేఖపై పరువు నష్టం దావా వేశారు. కొండా సురేఖ చేసిన వ్యాఖ్యల వీడియో క్లిప్పింగ్స్, సోషల్ మీడియా లింక్స్‌తో కలిపి నాంపల్లిలోని ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తమ కుటుంబ పరువు ప్రతిష్టకు భంగం కలిగించేలా కొండా సురేఖ వ్యాఖ్యలు చేశారని.. చట్టపరమైన క్రిమినల్ చర్యలతోపాటు పరువునష్టానికి సంబంధించి బీఎస్ఎస్ 356 కిద చర్యలు తీసుకోవాలని కోర్టును కోరారు. అయితే ఇటీవల మంత్రి కొండా సురేఖ.. హీరో నాగార్జునకు క్షమాపణలు చెప్పారు. దాంతో ఈ కేసును హీరో నాగార్జున ఉపసంహరించుకున్న సంగతి తెలిసిందే.

## ఇద్దరు ఐఏఎస్ అధికారులకు తెలంగాణ హైకోర్టు నోటీసులు.. కారణమిదే

హైదరాబాద్, డిసెంబర్ 11: ఆర్టీఐ చట్టం కింద సమాచారం ఇవ్వలేదంటూ దాఖలైన పిటిషన్‌పై ఇద్దరు ఐఏఎస్‌లకు తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కోర్టు ఆదేశాలు ఉన్నా ఆర్టీఐ చట్టం కింద సమాచారం అందజేయలేదని మాజీ జీహెచ్‌ఎంసీ కమిషనర్ కె.ఇలంబర్తి, ప్రస్తుత జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి కర్ణన్లకు హైకోర్టు నోటీసులు ఇచ్చింది. ఆర్టీఐ చట్టం ప్రకారం పిటిషనర్ అడిగిన సమాచారం ఇవ్వకపోవడంతో గతంలో సికింద్రాబాద్‌లోని రాంగోపాల్‌పేటకు చెందిన వడ్డం శ్యామ్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం వెంటనే అడిగిన సమాచారం ఇవ్వాలని నవంబర్ 24న ఆదేశాలు జారీ చేసింది. అయితే హైకోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ అధికారులు పట్టించుకోలేదని శ్యామ్ మరోసారి కోర్ట్‌ను ఆశ్రయించారు. ఈరోజు (గురువారం) విచారణ జరిపిన ధర్మాసనం.. ఐఏఎస్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ధిక్కరణ కింద చర్యలు ఎందుకు తీసుకోవద్దో తెలపాలని ఐఏఎస్ అధికారులపై మండిపడింది. కోర్టు ఆదేశాలు ఎందుకు పాటించలేదో వివరిస్తూ జనవరి 26న కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. అంతేకాకుండా కోర్ట్ ఉత్తర్వులు పాటించకపోతే జరిమానా విధిస్తామని ఇద్దరు ఐఏఎస్ అధికారులకు హైకోర్టు ధర్మాసనం హెచ్చరికలు జారీ చేసింది.




న్యూఢిల్లీ, డిసెంబర్ 11: ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. శుక్రవారం పోలీసుల ముందు సరండర్ కావాలని ప్రభాకర్ రావును జస్టిస్ బి.వి. నాగరత్న సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది. రేపు ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ (సిట్) ముందు హాజరు కావాలని ఆయనకు స్పష్టం చేసింది. ఏసీపీ వెంకటగిరి ముందు హాజరుకావాలని ప్రభాకర్ రావుకు సూచించింది. విచారణ సమయంలో ఆయనను ఎటువంటి టార్చర్ చేయవద్దంటూ సిట్ అధికారులకు సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది. ఈ కేసు విచారణను వచ్చే శుక్రవారం పర్యవేక్షించనున్నట్లు సుప్రీంకోర్టు ధర్మాసనం వెల్లడించింది. కస్టడీ సమయంలో ప్రభాకర్ రావుకు ఇంటి నుంచి భోజనాన్ని తీసుకు వెళ్లేందుకు న్యాయస్థానం అనుమతించింది. మరో వైపు ఈ కేసులో 14 రోజుల పాటు ప్రభాకర్ రావును విచారణకు అనుమతించాలని సుప్రీంకోర్టు ధర్మాసనాన్ని తెలంగాణ ప్రభుత్వం తరఫు న్యాయవాది సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు బెయిల్ రద్దు చేయాలంటూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. ఈ కేసును గురువారానికి వాయిదా వేసింది. ఈ పిటిషన్‌పై గతనెల.. నవంబర్ 18వ తేదీనే వాదనలు జరగాల్సి ఉంది. కానీ ప్రభాకర్ రావు తరఫు న్యాయవాది అందుబాటులో లేరు. దాంతో ఈ పిటిషన్‌పై విచారణ పలుమార్లు వాయిదా పడుతూ వచ్చింది. చివరగా ఈ రోజు.. అంటే గురువారం ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక ఆధారాలను ప్రభాకర్ రావు ధ్వంసం చేశారంటూ సుప్రీంకోర్టును తెలంగాణ ప్రభుత్వం ఆశ్రయించింది. డిజిటల్ ఎక్విప్‌మెంట్, పాస్ వర్డ్ ఇవ్వకుండా విసిగించడంతోపాటు విచారణకు ఆయన ఏ మాత్రం సహకరించ లేదని ప్రభుత్వం తరఫు న్యాయవాదులు సుప్రీంకోర్టుకు తమ వాదనల ద్వారా వినిపించారు. దీంతో ఫోరెన్సిక్ నిపుణుల ముందు ఐ క్లౌడ్, పాస్ వర్డ్ రీసెట్ చేయాలని గత విచారణలో ప్రభాకర్ రావును సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం విదితమే.

**ఇది జరిగింది.. ?...** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష పార్టీల నేతలపైనే కాకుండా.. స్వపక్షంలోని పలువురు అగ్రనేతల నేతలపై ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇదే విషయాన్ని వివిధ రాజకీయ పార్టీలకు చెందిన కీలక నేతలు సైతం పలుమార్లు వివిధ వేదికల మీద ఆరోపించారు. 2023 ఏడాది చివరిలో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో.. కాంగ్రెస్ పార్టీకి ఓటరు పట్టం కట్టాడు. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం కొలువు తీరింది. ఫోన్ ట్యాపింగ్ అంశంపై వాస్తవాలు వెలికి తీయాలంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్)ను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా గత ప్రభుత్వంలో ఇంటెలిజెన్స్‌లో కీలకంగా వ్యవహరించిన పలువురు ఉన్నతాధికారులను సిట్ అధికారులు సుదీర్ఘంగా విచారించారు. దాంతో ఫోన్ ట్యాపింగ్ జరిగింది వాస్తవమని వారు ధృవీకరించారు. ఈ సందర్భంగా పలువురు ఉన్నతాధికారులను అరెస్ట్ చేశారు. అయితే ఈ కేసులో అత్యంత కీలకంగా వ్యవహరించిన ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు అమెరికా వెళ్లిపోయారు. ఆయనను భారత్‌కు రప్పించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పలు ప్రయత్నాలు చేసింది. ఈ విషయం తెలుసుకున్న ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు.. సిట్ అధికారులు తనను అరెస్ట్ చేయకుండా ఉండాలంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ప్రభాకర్ రావును ముందస్తు అరెస్ట్ చేయవద్దంటూ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దాంతో స్వదేశానికి వచ్చిన ప్రభాకర్ రావు.. సిట్ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. కానీ ఈ విచారణలో అధికారులు సంధించిన ప్రశ్నలకు ప్రభాకర్ రావు ఎటువంటి సమాధానం ఇవ్వలేదు. బెయిల్ కోసం సుప్రీంకోర్టును ఆయన ఆశ్రయించారు. ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో ప్రభాకర్ రావు బెయిల్ రద్దు చేయాలంటూ సుప్రీంకోర్టును రేవంత్ ప్రభుత్వం ఆశ్రయించింది. ఈ కేసులో వాదోపవాదాలు విన్న అత్యున్నత న్యాయస్థానం.. పోలీసుల ఎదుట లొంగిపోవాలంటూ ప్రభాకర్ రావును ఆదేశించింది.

## మిమ్మల్ని చూస్తుంటే రతన్ టాటా గుర్తొస్తారు: ఆనంద్ మహీంద్రాపై చిరంజీవి ప్రశంసలు



మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రాపై చిరంజీవి ప్రశంసలు కురిపించారు. ఆనంద్ మహీంద్రాను చూస్తుంటే ఎన్నో విషయాల్లో రతన్ టాటా గుర్తొస్తారని అన్నారు. ఇటీవల జరిగిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్' కార్యక్రమంలో ఆయనతో దిగిన ఫొటోను చిరు ఎక్స్ వేదికగా పంచుకున్నారు. "డియర్ ఆనంద్ మహీంద్రా మీ వినయం, ఎంత ఎదిగినా ఒదిగిఉండే స్వభావం నిజంగా ఆదర్శనీయం. మీరు ఎన్నో విషయాల్లో రతన్ టాటాను గుర్తుకు తెస్తారు. ఆయన తన విలువలతో గొప్ప వ్యక్తిగా ఎదిగి ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచారు. మీరు కూడా అలానే అనిపిస్తారు. సేవా కార్యక్రమాలపై మీ నిబద్ధత ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. మీతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది" అని చిరంజీవి రాసుకొచ్చారు. ఈ అవకాశం కల్పించిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. తాజాగా 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్' గురించి కూడా చిరంజీవి తాజాగా పోస్ట్ పెట్టారు. "తెలంగాణ రైజింగ్ - 2047 విజన్‌లో భాగంగా అన్ని రంగాలతో పాటు సినిమా రంగానికి కూడా ప్రాముఖ్యతను ఇస్తున్నారు. హైదరాబాద్‌ను ఫిల్మ్, ఎంటర్‌టైన్‌మెంట్ గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దాలనే విజన్ చాలా గొప్పది. హైదరాబాద్‌పై ప్రపంచ సినిమా దృష్టిసారిస్తుందని విశ్వసిస్తున్నా" అని అన్నారు.

## ఆత్మహుతి చేసుకుంటా: ఎమ్మెల్యే మాధవరం




హైదరాబాద్ : తాను ఎలాంటి కబ్జాలకు పాల్పడ లేదని.. తానేంటో ప్రజలకు తెలుసునని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. ఐడీపీఎల్ భూముల కబ్జాపై తనపై ఇద్దరు నేతలు అసత్య ప్రచారం చేయిస్తున్నారని మండిపడ్డారు. ఆ భూముల్లో నివాసం ఉంటున్న పేదల జోలికి వెళ్తే ఆత్మాహుతి చేసుకుంటానని ఆయన హెచ్చరించారు. సదరు భూముల్లో తాను గజం జాగా కబ్జా చేశానని నిరూపిస్తే.. తాను జైలుకెళ్లేందుకు సిద్ధమని చెప్పారు. రూ. 4 వేల కోట్ల విలువైన భూ వివాదంపై లోతుగా దర్యాప్తు చేయాలని ఈ సందర్భంగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతిని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా పాల్పడుతున్నారని తాను గతంలోనే చాలా సార్లు ఫిర్యాదు చేశానని ఆయన గుర్తు చేశారు. అక్కడ స్థానికంగా ఉంటున్న ఇంద్రనగర్ 70 ఏళ్ల క్రితం ఏర్పడిందని తెలిపారు.

అక్కడ నివసిస్తున్న ప్రజల కోసం డ్రైనేజీ, రహదారుల సౌకర్యం కల్పించాలంటూ జీహెచ్‌ఎంసీ నుంచి గతంలో నిధులు తీసుకొచ్చానని వివరించారు. అయితే ఐడిపిఎల్ ఉద్యోగులను తాను బెదిరించాననేది పూర్తిగా అవాస్తవమని ప్రకటించారు. ఈ ఆరోపణలను తాను పూర్తిగా ఖండిస్తున్నానని పేర్కొన్నారు.

**ఇంతకీ ఏం జరిగిందంటే..?...** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత.. రాష్ట్రవ్యాప్తంగా జనం బాట పేరుతో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను ఆమె ప్రస్తావిస్తున్నారు. అలాగే తాజాగా కూకట్‌పల్లిలో ఆమె జనం బాట చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను ఆమె ప్రస్తావించారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత మాధవరం కృష్ణారావుపై కవిత వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై బుధవారం ప్రెస్ మీట్ పెట్టి ఎమ్మెల్యే కృష్ణారావు కాస్తా ఘాటుగా స్పందించారు. దాంతో ఎమ్మెల్యే కృష్ణారావుపై జాగృతి నేతలతోపాటు అధ్యక్షురాలు కవిత మండిపడ్డారు. ఆధారాలతో సహా అన్ని విషయాలు బయటపెడతానంటూ కవిత స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కృష్ణారావు పై విధంగా స్పందించారు.

## గజ గజ.. సింగిల్ డిజిట్‌కి పడిపోయిన ఉష్ణోగ్రతలు

హైదరాబాద్ : నగరంలో చలి తీవ్రత పెరిగిపోతుంది. పట్టణమంతా చలి ప్రభావానికి వణికిపోతుంది. రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కే పడిపోయాయి. నగరవ్యాప్తంగా తీవ్రమైన చలి గాలులు వీస్తాయని, ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతాయని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరించింది. ముఖ్యంగా ఉదయం వేళల్లో చలి తీవ్రత ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. గాలిలో తేమ శాతం పెరిగిపోవడం, వాతావరణంలో వచ్చిన మార్పులతో చలి తీవ్రత పెరిగిందని శాస్త్రవేత్తలు అంటున్నారు. సాధారణంగా జనవరిలో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అలాంటిది ఈ ఏడాది డిసెంబర్‌లోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. శేరిలింగంపల్లి 9 డిగ్రీలు, రాజేంద్రనగర్ 10.7, గచ్చిబౌలి 11, శివరాంపల్లి 12.4, తిట్టిఅన్నారం 12.4, మచ్చ బొల్లారం 13.1, అల్వాల్ 13.2, జీడిమెట్ల 13.3, కుత్బుల్లాపూర్ 13.4, కూకట్‌పల్లి 13.5, బేగంపేట 13.6, లింగంపల్లి 14.2, మాధాపూర్ 14.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.




## బాలకృష్ణకు మరో షాక్.. అఖండ-2పై హైకోర్టులో పిటిషన్

హైదరాబాద్: తెలంగాణ హైకోర్టులో అఖండ 2 సినిమా టికెట్ల ధర పెంపుపై లంచ్ మోషన్ పిటిషన్ దాఖలైంది. ప్రభుత్వం ఇచ్చిన జీవోను రద్దు చేయాలని కోరుతూ న్యాయవాది శ్రీనివాస్ రెడ్డి పిటిషన్ వేశారు. లంచ్ మోషన్‌కి అనుమతించిన న్యాయస్థానం.. టికెట్ల ధర పెంపుతో పాటు ప్రత్యేక షోల నిర్వహణపై విచారణ చేయనుంది. కాగా, అఖండ-2 తాండవం సినిమా టికెట్ ధరలు పెంచుకునేందుకు రేవంత్ ప్రభుత్వం అనుమతి ఇచ్చిన సంగతి సంగతి తెలిసిందే. ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు టికెట్ రేట్లు పెంచుకోవచ్చని ఉత్తర్వులు జారీ చేసింది. సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టికెట్‌పై రూ.50, మల్టీప్లెక్స్‌లలో రూ.100 అదనంగా వసూలు చేసుకునేందుకు అనుమతి కల్పించింది. డిసెంబర్ 11వ తేదీ ప్రీమియర్ షో టికెట్ ధరను రూ. 600గా నిర్ణయించగా అందుకు కూడా ఓకే చెప్పింది. అయితే, టికెట్ ధరల పెంపునకు అనుమతి ఇస్తూనే చిత్ర బృందానికి రేవంత్ ప్రభుత్వం ఓ షరతు పెట్టింది. సినిమా టికెట్ ధరల పెంపు ద్వారా వచ్చే లాభాల్లో 20 శాతాన్ని సినీ కార్మికుల సంక్షేమానికి కేటాయించాలని ఆదేశాలు జారీ చేసింది.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com